# వాస్తవం

డెయిలీ.కామ్

ఉన్నది ఉన్నట్లుగా

డిజిటల్ పత్రిక

శనివారం
21.02.2026

ఎడిటర్: ఎం.కృష్ణారెడ్డి


## డిజిటల్ గవర్నెన్స్‌లో తెలంగాణ రోల్ మోడల్

**ఏఐ, క్వాంటం కంప్యూటింగ్‌తో విప్లవాత్మక మార్పులు**

**సామాన్యుడి చెంతకు అత్యాధునిక సాంకేతికత**

**ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ 2026లో మంత్రి దుద్దిళ్ల**



12లో.

కొత్త పుంతలు తొక్కుతున్న డిజిటల్ గవర్నెన్స్‌లో దేశానికే తెలంగాణను రోల్ మోడల్‌గా తీర్చిదిద్దుతున్నట్లు ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. కృత్రిమ మేధ (ఏఐ), క్వాంటం కంప్యూటరింగ్‌తో విప్లవాత్మక మార్పులొస్తాయని, తద్వారా సామాన్యుడికి చెంతకు అత్యాధునిక సాంకేతికత చేరుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.


## సంస్కరణల ముసుగులో
# గ్రామీణ వ్యవస్థల విధ్వంసం

**పాలకుల 'తుగ్లక్' ప్రయోగాలకు**

**బలిపశువులవుతున్న సామాన్యులు**

**క్షేత్రస్థాయిలో ఉన్న పటిష్టమైన వ్యవస్థలను బలోపేతం చేయాల్సింది పోయి**

**ఉన్న పునాదులను సైతం పెకిలించివేస్తున్న వైనం**



11లో..

తెలంగాణ గడ్డపై గ్రామ స్వరాజ్యం విరాజిల్లుతుందని, పాలన ప్రజల ముంగిటకే వస్తుందని ఆశించిన కోట్లాది మంది ప్రజలకు నేడు పాలకుల అసంబద్ధ విధానాలు శాపంగా మారాయి. నిజాం కాలం నాటి పటేల్-పట్వారీ వ్యవస్థ నుండి నేటి 'గ్రామ పాలనా అధికారుల' వరకు జరిగిన ప్రయాణం అభివృద్ధి వైపు కాక, అస్తవ్యస్తమైన అగాధంలోకి సాగిందనడంలో ఎటువంటి సందేహం లేదు. సంస్కరణల పేరుతో గత దశాబ్ద కాలంగా సాగుతున్న పరిపాలనా ప్రయోగాలు క్షేత్రస్థాయిలో ఉన్న పటిష్టమైన వ్యవస్థలను బలోపేతం చేయాల్సింది పోయి, ఉన్న పునాదులను సైతం పెకిలించివేశాయి. ఒక వ్యవస్థను రద్దు చేసేముందు దానికంటే మెరుగైన ప్రత్యామ్నాయాన్ని సిద్ధం చేయడంలో పాలక వర్గాల మేధో వైఫల్యం నేడు సామాన్య పౌరుడి పాలిట యమపాశమై కూర్చుంది.

# హైదరాబాద్‌లో ఏఐ వార్ రూమ్

**కేంద్రం అనుమతిస్తే నిర్వహించేందుకు తెలంగాణ సిద్ధం: సీఎం రేవంత్‌రెడ్డి**

**(ఏఐ) రంగంలో భారత్ ముందంజలో నిలవాలంటే ప్రత్యేక ఏఐ మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలి**

**జాతీయ ఏఐ నిధి ఏర్పాటు చేయాలి**



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 20 :**

ప్రస్తుతం యావత్ ప్రపం చాన్ని ప్రభావితం చేస్తున్న ఆర్టిఫిషియల్ ఇంటె లిజెన్స్ (ఏఐ) రంగంలో భారత్ ముందంజలో నిలవాలంటే కేంద్ర ప్రభుత్వంలో ప్రత్యేక ఏఐ మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని తెలంగాణ ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి సూచించారు. ఏఐ వినియోగం, నియంత్రణ, చట్టపరమైన మార్గ దర్శకాలు, జాతీయ భద్రత వంటి అంశాలను సమగ్రంగా నిర్వహించేందుకు ప్రత్యేక వ్యవస్థ అవసరమని సీఎం స్పష్టం చేశారు.ప్రపంచ ఏఐ పోటీ ఇప్పటికే ప్రారంభమైందని.. కొన్ని దేశాలు, కంపెనీలు ముందంజలో ఉన్నాయని సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. గత పారిశ్రామిక విప్లవాల సమయంలో జరిగిన అవకాశ నష్టాలను గుర్తు చేస్తూ, ఈసారి భారత్ అలాంటి తప్పిదం చేయకూడదని హెచ్చరించారు. సేవలు, సాఫ్ట్‌వేర్ రంగాల్లో విజయం సాధించిన భారత్, ప్రపంచ స్థాయి కోర్ టెక్నాలజీ ఉత్పత్తుల్లో కూడా నాయకత్వం వహించాలని పిలుపునిచ్చారు.ప్రపంచవ్యాప్తంగా ఏఐ పరిణామాలను నిశితంగా పర్యవేక్షించేందుకు కేంద్ర, రాష్ట్రాల సమన్వయంతో జాతీయ ఏఐ వార్ రూమ్ ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి ప్రతిపాదించారు. కేంద్రం అనుమతిస్తే హైదరాబాద్‌లో అలాంటి వార్ రూమ్ నిర్వహించేందుకు తెలంగాణ సిద్ధంగా ఉందని తెలిపారు. ప్రపంచ స్థాయి పరిశోధనలకు ఊత మిచ్చే ఏఐ యూనివర్సిటీని దేశంలో స్థాపించా లని సూచించారు. ఏఐ విస్తరణ నేపథ్యంలో ఉపాధిపై ఉద్భవిస్తున్న ఆందోళనలను ప్రస్తావి స్తూ.. కొన్ని రంగాల్లో ఉద్యోగ నష్టాలు సంభవించవచ్చని పేర్కొన్నారు. అయితే సరైన రీస్కిల్లింగ్, అప్-స్కిల్లింగ్ చర్యల ద్వారా ఏఐ వల్ల సృష్టించబడే కొత్త అవకాశాలు మరింత విస్తృతంగా ఉంటాయని అభిప్రాయపడ్డారు. యువతను ఏఐ - ఆధారిత భవిష్యత్తుకు సిద్ధం చేయాలని పిలుపునిచ్చారు.స్టార్టప్‌లకు మద్దతు కల్పించేందుకు జాతీయ ఏఐ నిధి ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి ప్రతిపాదించారు. దేశవ్యాప్తంగా ఏఐ ఆవిష్కరణలకు కేంద్రంగా నిలిచే 'ఏఐ స్టార్టప్ విలేజ్'ను తెలంగాణలో ఏర్పాటు చేయడానికి రాష్ట్రం సిద్ధంగా ఉందని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు.

## వారంలో అక్రెడిటేషన్ కమిటీలు పూర్తిచేయాలి



**డీపీఆర్వోలకు ఐఅండ్‌పీఆర్ స్పెషల్ కమిషనర్ ప్రియాంక ఆదేశం**

**హైదరాబాద్, ఫిబ్రవరి 20 :** జిల్లా స్థాయి అక్రెడిటేషన్ కమిటీలను వారం రోజుల్లో పూర్తిచేయాలని సమాచార పౌరసంబంధాలశాఖ స్పెషల్ కమిషనర్ సీహెచ్ ప్రియాంక డీపీఆర్వోలను ఆదేశించారు. అక్రెడిటేషన్ కార్డుల జారీ ప్రక్రియ విధివిధానాలపై శుక్రవారం నాంపల్లిలోని మీడియా అకాడమీ ఆడిటోరియంలో డీపీఆర్వోలు, క్షేత్రస్థాయి సిబ్బందికి శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రియాంక మాట్లాడుతూ.. జీవోలు 252, 103లపై డీపీఆర్వోలు పూర్తిస్థాయి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ప్రింట్, ఎలక్ట్రానిక్, డిజిటల్ మీడియా, ఫ్రీలాన్స్, వెటరన్ జర్నలిస్టుల అక్రెడిటేషన్ కార్డుల నమోదు, దరఖాస్తుల పరిశీలన, రిపోర్టులు, అప్రూవల్ లిస్టులు, రిజిస్ట్రేషన్ నంబర్ కేటాయింపు, అక్రెడిటేషన్ కార్డుల డౌన్‌లోడింగ్ వంటి అంశాలపై అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. అక్రెడిటేషన్ కార్డుల ప్రక్రియలో భాగంగా ఆన్‌లైన్, ఇతర సమస్యలు తలెత్తితే రాష్ట్ర ప్రధాన కార్యాలయంలోని మీడియా రిలేషన్ వింగ్ అధికారులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు.

## పంచాయతీలకు గుడ్ న్యూస్
# రూ.387.53 కోట్లు విడుదల

- మూడోవిడతగా 15వ ఆర్థిక సంఘం నుంచి విడుదల
- ఇంకా కేంద్రం వద్ద పెండింగ్‌లోనే కూ.2000 కోట్లు
- పెండింగ్ నిధులను త్వరగా విడుదల చేయాలి:మంత్రి సీతక్క




రాష్ట్రంలోని గ్రామ పంచాయతీల అభివృద్ధికి సంబంధించి 15వ ఆర్థిక సంఘం నిధులను కేంద్ర ప్రభుత్వం విడుదల చేస్తున్నది. రాష్ట్రంలో ఇటీవల పంచాయతీ ఎన్నికల ప్రక్రియ ముగియడంతో పెండింగ్‌లోని నిధులను విడతలవారీగా మంజూరు చేస్తున్నది. ఈ క్రమంలోనే శుక్రవారం మూడో విడతకుగాను రూ.387.53 కోట్లను విడుదల చేసింది.

11లో..



ఇంకా సుమారు రూ.2,000 కోట్ల మేర విడుదల చేయాల్సిన నిధులు పెండింగ్‌లో ఉన్నాయని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి సీతక్క ఒక ప్రకటనలో తెలిపారు. పెండింగ్ నిధులను తక్షణమే విడుదల చేయాలని కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తిచేశారు.

# వేసవిలో నీటి ఎద్దడి రాకుండా చర్యలు

**సర్పంచి కవితా రామ్మోహన్ రెడ్డి**

**మర్కుక్ : వాస్తవం :**



మండలంలోని ఎర్రవల్లి గ్రామ ఎస్సీ కాలనీలో మంచినీటి సమస్య రాకుండా చర్యలు చేపడుతున్నట్లు గ్రామ సర్పంచ్ కవిత రామ్మోహన్ రెడ్డి తెలిపారు. శుక్రవారం నూతన పైప్‌లైన్ నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత రెండేళ్లుగా నీటి కొరతతో ఇబ్బందులు పడుతున్న కాలనీవాసుల సమస్యను దృష్టిలో పెట్టుకుని, ఎన్నికల హామీ మేరకు పనులు ప్రారంభించినట్లు సర్పంచ్ తెలిపారు. వేసవిలో నీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఎమ్మెల్యే, ఎంపీ నిధులతో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సబితా కరుణాకర్, పార్టీ అధ్యక్షుడు ఆంజనేయులు, మాజీ ప్రజా ప్రతినిధులు బిక్షపతి, కిష్టారెడ్డి,వెంకటయ్య పాల్గొన్నారు.

# అసంపూర్ణ వంతెనల పూర్తికి మంత్రి హామీ

**రైల్వే బ్రిడ్జిలపై కాలవ ప్రస్తావన**

**వాస్తవం : డి హీరేహాళ్ ,అనంతపురం ఫిబ్రవరి 20**



రాయదుర్గం పట్టణంలో అర్ధాంతరంగా ఆగిపోయిన రైల్వే వంతెనలను పూర్తి చేస్తామని రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి హామీ ఇచ్చారు. రాష్ట్ర అసెంబ్లీలో ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు శుక్రవారం రాయదుర్గంలో అసంపూర్ణంగా ఉన్న రైల్వే బ్రిడ్జిల గురించి ప్రస్తావించారు. గత తెలుగుదేశం ప్రభుత్వంలో చేపట్టిన సదరు వంతెనలు అర్ధాంతరంగా ఆగిపోయాయన్నారు. వైకాపా ప్రభుత్వం వీటి గురించి ఏమాత్రం పట్టించుకోకపోవడంతో నేడు దిష్టిబొమ్మల్లా దర్శనమిస్తున్నాయని ఆందోళన వ్యక్తపరిచారు. రాయదుర్గం నుండి అనంతపురం, కనేకల్లుకు వెళ్ళే ప్రధాన రహదారుల్లో రెండు వంతెనలు అసంపూర్తిగా మిగిలిపోయాయన్నారు. వాటిని త్వరితగతిన పూర్తి చేయాలని కేంద్ర రైల్వే శాఖ మంత్రి దృష్టికి కూడా తీసుకెళ్లామన్నారు. అనంతపురం వెళ్లే రహదారి జాతీయ రహదారి నెంబర్ 544 డిడిగా గుర్తించడంతో వన్ టైం ఇంప్రూమెంట్ కింద చేపట్టవచ్చని సూచించడంతో రూ.51.75 కోట్లతో ప్రతిపాదనలు పంపడం జరిగిందన్నారు. రాష్ట్ర రోడ్డు భవనాలు శాఖ మంత్రి తన పలుకుబడి ఉపయోగించి ఈ పనిని జాతీయ రహదారుల అభివృద్ధి సంస్థ ద్వారా పూర్తి చేయించాలని కోరారు. ఎమ్మెల్యే విన్నపంపై మంత్రి జనార్దన్ రెడ్డి స్పందిస్తూ, రాష్ట్రంలో అసంపూర్తిగా మిగిలిపోయిన వంతెనల ప్రతిపాదనలు పంపాలని ప్రభుత్వం ఆదేశించిందన్నారు. చాలా చోట్ల 70 నుండి 90 శాతం పనులు పూర్తయి అర్ధాంతరంగా ఆగిపోయాయన్నారు. ప్రభుత్వం నుండి అనుమతులు తీసుకొని త్వరలో వాటిని పూర్తి చేయిస్తామన్నారు. రాయదుర్గం బ్రిడ్జి పనులు కూడా పూర్తి చేయిస్తామని మంత్రి హామీ ఇచ్చారు.

# ప్రమాదకరంగా కోహీర్-ఖానాపూర్ రోడ్డు

**పట్టింపులేని పాలకులు**

**వాస్తవం : సంగారెడ్డి జిల్లా ప్రతినిధి**



జహీరాబాద్ నియోజకవర్గం కోహీర్ మండలం కోహీర్ మున్సిపాలిటీ నుండి ఖానాపూర్, కొత్తూర్(కె) గ్రామాల మీదుగా సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రాచన్న స్వామి మందిరం వెలసిన బడంపేట్ గ్రామం వరకు వెళ్లే రోడ్డు ప్రమాదకరంగా మారి ప్రయాణికులకు ఇబ్బందికరంగా మారింది. నిత్యం వందలాదిమంది ప్రయాణించే రోడ్డు గుంతలు గుంతలుగా మారి ప్రమాదకర పరిస్థితిలో ఉండటంతో ప్రయాణికులు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు. ఆసుపత్రులకు వెళ్లే గర్భిణీ స్త్రీలు, వృద్ధులు, వికలాంగులు, సైకిళ్లపై పాఠశాలలకు మరియు కళాశాలలకు వెళ్లే విద్యార్థులు, కోహీర్ మండల కేంద్రం నుంచి నిత్యం రాకపోకలు కొనసాగించే రైతులు, మహిళలు మరియు ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. కోహీర్ నుంచి ఖానాపూర్ గుండా వెళ్లే ఈరోడ్డు ఖానాపూర్ గ్రామంతో పాటు కొత్తూర్(కె), సజ్జాపూర్, బడంపేట్, పర్వపల్లి, గొటిగార్పల్లి తదితర గ్రామాలకు రవాణా సౌకర్యంగా ఉన్నది. నిత్యం వందలాదిమంది ప్రయాణికులకు మరియు వాహనదారు లకు ఇబ్బందికరంగా మారి, ప్రమాదాలకు కారణమవుతున్న రోడ్డును త్వరితగతిన బాగుచేసి ప్రజలకు సరియైన రవాణా సౌకర్యాన్ని కల్పించవలసిన బాధ్యత ప్రజల చేత ఎన్నికోబడిన నాయకుల కు మరియు ప్రజలు చెల్లిస్తున్న పన్నులతో జీతాలు పొందుతున్న అధికారులపై ఉన్నది. అందువల్ల అస్తవ్యస్తమై గుంతలు గుంతలుగా మారి ప్రమాదాలకు వేదికగా మారిన కోహీర్ నుంచి ఖానాపూర్ మీదుగా వెళ్లే ప్రమాదకరమైన రోడ్డు పరిస్థితిని నాయకులు, అధికారులు పట్టించుకుని మరమ్మతులు చేయించాలని స్థానికులు కోరుతున్నారు

# చిరుత పులి సంచారం

**భయాందోళనలో ప్రజలు**



**వాస్తవం : వేములవాడ**

వేములవాడ మున్సిపల్ పరిధిలోని హన్మక్కపల్లిలో చిరుత పులి సంచారం సమాచారంతో కలకలం రేపింది. గ్రామానికి చెందిన రోమాల భూమయ్య అనే రైతుకి చెందిన ఆవు దూడపై అర్ధరాత్రి వేళ చిరుత దాడి చేయగా అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలుస్తోంది. విషయం తెలుసుకున్న అటవీ శాఖ రేంజ్ అధికారి ఖలీలుద్దీన్ సంఘటన స్థలానికి చేరుకుని పాదముద్రల ఆధారంగా దాడి చేసింది చిరుత పులి అని నిర్ధారించారు. పొలాలకు వెళ్ళే రైతులు అప్రమత్తంగా ఉండాలని, అటవీ ప్రాంతాలకు దగ్గరగా పశువులను కట్టేయ వద్దని, ఒంటరిగా పొలాలకు వెళ్ళవద్దని సూచించారు. చిరుత జాడ తెలిస్తే అటవీ శాఖాధికారులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

**మాతృ భాష విశిష్ట సాహితీ**

## ప్రతిభా పురస్కారం ప్రదానం



**వాస్తవం : చందుర్తి**

రచయిత, అనువాదకుడు చందుర్తి మండలం నర్సింగాపూర్ గ్రామానికి చెందిన ఆర్మీ సైనికుడు డాక్టర్ పెరుక రాజుకి సాహిత్యంలో చేస్తున్న విశిష్ట కృషికి గాను ప్రతిష్ఠాత్మకమైన విశిష్ట సాహితీ ప్రతిభా పురస్కారం 2026 హైదరాబాద్ లోని రవీంద్ర భారతిలో తెలంగాణ భాషా సాంస్కృతికశాఖ, జాతీయ తెలుగు సారస్వత పరిషత్, ఆదిలీల ఫౌండేషన్ న్యూఢిల్లీ, తెలుగు భాషా చైతన్య సమితి సంయుక్త ఆధ్వర్యం లో శుక్రవారం నిర్వహించిన అంతర్జాతీయ మాతృ భాష దినోత్సవ ప్రత్యేక కార్యక్రమంలో పురస్కారాన్ని ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కేశరాజు రాంప్రసాద్, తెలుగు సారస్వత పరిషత్ అధ్యక్షులు, నిర్వాహకులు పి బడే సాబ్, డాక్టర్ ఆదినారాయణ, ఆదిలీల ఫౌండేషన్, న్యూఢిల్లీ అధ్యక్షులు బాల చారి, తెలంగాణ భాష సాంస్కృతిక శాఖ, కార్యదర్శి, కుమారి పి వృంధ, రాధ, కుసుమం సాహితీవేత్తలు, భాషా ప్రేమికులు, కవులు,తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ ఆంజనేయ ఆలయ నిర్మాణానికి భూమి పూజ



**వాస్తవం : చందుర్తి**

చందుర్తి మండలం రామన్నపేట గ్రామంలో శ్రీ ఆంజనేయ స్వామి ఆలయ నిర్మాణానికి శుక్రవారం గ్రామ సర్పంచ్ పోతరాజు భారతి-నగేష్ భూమి పూజ చేశారు. అర్చకులు పవన్ శర్మ చేతుల మీదుగా భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామంలో హనుమాన్ ఆలయ నిర్మాణానికి గ్రామస్తులందరు సహకరించడం అభినందనీయమన్నారు.సాధ్యమైనంత తొందరగా ఆలయాన్ని నిర్మిస్తామని సర్పంచ్ తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ వేణు, ఆలయ కమిటీ అధ్యక్షులు బొడ్డు భూమయ్య, వైస్ చైర్మన్ కొత్త శ్రీనివాస్ రెడ్డి,నాయకులు గుడిసె రమేష్, బుర్ర మల్లేశం, వెంకటేశం,లచ్చిరెడ్డి,బత్తుల సురేష్, రాజిరెడ్డి, మహేందర్ రెడ్డి, ముత్తయ్య, శ్రీను,లక్ష్మణ్ పాల్గొన్నారు.

# పీఎంశ్రీ స్కూళ్లలో అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయాలి

**జిల్లా ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**పీఎంశ్రీ కింద ఎంపికైన విద్యాలయాల్లో అభివృద్ధి పనులపై సమీక్ష**

**వాస్తవం : రాజన్న సిరిసిల్ల (ప్రతినిధి)**



రాజన్న సిరిసిల్ల జిల్లాలో పీఎంశ్రీ కింద ఎంపికైన స్కూళ్లలో మొదలు పెట్టిన అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని రాజన్న సిరిసిల్ల ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. పీఎంశ్రీ కింద ఎంపికైన విద్యాలయాల్లో చేపట్టిన అభివృద్ధి పనులపై జిల్లా సమీకృత కార్యాలయంలో శుక్రవారం జిల్లా విద్యాధికారి, టీజీఈడబ్ల్యూఐడీసీ అధికారులతో జిల్లా ఇంచార్జి కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు.పీఎంశ్రీ కింద జిల్లాలో మొత్తం 16 విద్యాలయాలు ఎంపిక అయ్యాయని, వాటిలో అదనపు తరగతి గదులు, కంప్యూటర్ ల్యాబ్‌లు, సైన్స్ ల్యాబ్‌లు, లైబ్రరీలు, వర్షం నీరు ఇంకుడు గుంతలు ఇతర నిర్మాణాలు ఉన్నాయని జిల్లా ఇంచార్జి కలెక్టర్ దృష్టికి అధికారులు తీసుకువెళ్ళారు. ఈ సందర్భంగా జిల్లా ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడారు. పీఎంశ్రీ కింద ఎంపికైన విద్యాలయాల్లో ఒక ప్రణాళిక ప్రకారం అభివృద్ధి పనులు పూర్తి చేయాలని, విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు సూచించారు. ఆయా స్కూళ్లలో పనులను జిల్లా విద్యాధికారి పరిశీలించాలని ఆదేశించారు. కస్తూర్బాగాంధీ బాలిక విద్యాలయాల్లో చేపట్టిన పనులను పూర్తి చేయాలని సూచించారు. ఈసమీక్షలో జిల్లా విద్యాధికారి జగన్ మోహన్ రెడ్డి, టీజీఈడబ్ల్యూఐడీసీ డీఈ సత్యనారాయణ రావు, ఏఈలు నాగరాజు, అశోక్ కుమార్, అధికారులు పాల్గొన్నారు.

# రేచపల్లికి బస్సు సౌకర్యం పునరుద్ధరించండి

**జగిత్యాల బస్సు డిపో మేనేజర్‌కు ఉమ్మడి రేచపల్లి సర్పంచ్ విజ్ఞప్తి**

**వాస్తవం, జగిత్యాల, ఫిబ్రవరి 20**

రేచపల్లి గ్రామానికి బస్సు సౌకర్యం గణనీయంగా తగ్గిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని రేచపల్లి ఉమ్మడి సర్పంచ్ బాస మహేష్, గడ్డం గంగారాం, మైనేని ప్రమీల, భూక్యా భారతిలు జగిత్యాల బస్సు డిపో మేనేజర్‌కు వినతి అందజేశారు. గతంలో రోజుకు రెండు బస్సులు ప్రతి 30 నిమిషాలకు ఒక్క రోజుకు 16 ట్రిప్పులు నడిచినప్పటికీ, ప్రస్తుతం ఉదయం ఒకసారి, సాయంత్రం మరోసారి మాత్రమే బస్సు నడుస్తోందని సర్పంచ్‌లు తెలిపారు. విద్యార్థులు, మహిళలు, ఉద్యోగులు, కూలీల దైనందిన ప్రయాణం కష్ట సాధ్యమైందని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళల ఉచిత బస్సు ప్రయాణ పథకం ప్రయోజనాలు గ్రామానికి చేరాలంటే తక్షణమే రోజుకు కనీసం రెండు బస్సులు కేటాయించి, ఒక బస్సు ఉదయం 6:00 నుండి రాత్రి 8:00 వరకు నిరంతరంగా నడిపించాలని ఉమ్మడి రేచపల్లి సర్పంచ్‌లు వినతి పత్రంలో కోరామన్నారు.



# బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలి

**వాస్తవం, జగిత్యాల ఫిబ్రవరి 20**

జగిత్యాలలో స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేస్తూ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వినతి కార్యక్రమం నిర్వహించారు. బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి ముసిపట్ల లక్ష్మీనారాయణ నాయకత్వంలో సంఘ ప్రతినిధులు అదనపు కలెక్టర్ రాజా గౌడ్ కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ముసిపట్ల లక్ష్మీనారాయణ మాట్లాడుతూ, రాష్ట్రంలో బీసీలు జనాభా పరంగా గణనీయమైన వర్గమని, అయితే స్థానిక సంస్థల పాలనలో తగిన ప్రాతినిధ్యం లభించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. న్యాయమైన భాగస్వామ్యం కోసం 42 శాతం రిజర్వేషన్ అత్యవసరమని, ఇది అమలు చేయడం ద్వారా సామాజిక సమతుల్యత సాధ్యమవుతుందని తెలిపారు. ప్రభుత్వం వెంటనే సానుకూల నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. డిమాండ్లను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోని పక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ప్రజాస్వామ్యంలో బీసీలకు సముచిత హక్కులు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని అన్నారు.వినతి పత్రం స్వీకరించిన అదనపు కలెక్టర్ రాజా గౌడ్ స్పందిస్తూ, సంఘం ప్రతినిధుల అభ్యర్థనలను సంబంధిత ఉన్నతాధికారులు, ప్రభుత్వానికి నివేదిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# 22న పూర్వ విద్యార్థుల సమ్మేళనం

**వాస్తవం-ముప్కాల్**

ముప్కాల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు 2003-04 పదోతరగతి బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు ఈ నెల 22 ఆదివారం రోజు స్థానిక పాఠశాల ఆవరణలో ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమం ఏర్పాటు చేసుకుంటున్నట్లు పూర్వ విద్యార్థులు శుక్రవారం రోజు ఒక ప్రకటనలో తెలిపారు. 2003-04 విద్యార్థులు తప్పకుండా ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొనాలని కోరారు.




# మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం



**మార్కుక్ : వాస్తవం :**

మర్కుక్ మండల కేంద్రానికి చెందిన ఇసకంటి యాదయ్య (45) అనారోగ్యంతో బాధపడుతూ గురువారం మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు మార్కుక్ కరుణాకర్ రెడ్డి ,గ్రామ సర్పంచ్ బుల్లె రాణి మల్లేశం శుక్రవారం మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు.పరామర్శించిన వారిలో వార్డు సభ్యులు రవి,కల్పన రాజు,నాయకులు సుధాకర్ రెడ్డి, అనిల్, సర్వీ శ్రీకాంత్,కుమార్, గద్దల రాజు,నాగరాజు తదితరులు ఉన్నారు.

# పబ్లిక్ గార్డెన్‌లో 'చిన్నారుల చిత్ర కళా సంత'

**వాస్తవం : హన్మకండ**



హనుమకొండకు చెందిన ప్రముఖ చిత్రకారిణి డాక్టర్ సాగంటి మంజుల సాగంటీస్ ఆర్ట్స్ అకాడమీ స్థాపించి మూడు సంవత్సరాలుగా ప్రతి నెల చిత్ర కళా పోటీలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే..అదే క్రమంలో ఈ నెల 8-14 తేదీల మధ్య సాగంటీస్ వన్ వీక్ ఆర్ట్ ఛాలెంజ్ నిర్వహించి రోజుకో టాపిక్‌తో పిల్లలకు ఛాలెంజ్ ఇస్తూ 7 చిత్రాలు గీయించి వారి లోని ప్రతిభను వెలికి తీసే ప్రయత్నం చేశా రు. ఈ చిత్రాలన్నిటిని కలిపి ఈ నెల 22 ఆదివారం హను మకొండ పబ్లిక్ గార్డెన్‌లోని నేరెళ్ళ వేణు మాధవ్ కళా ప్రాంగణంలో చిత్ర కళా ప్రదర్శనను ఏర్పాటు చేస్తున్నట్టు ఇందులో రెండు తెలుగు రాష్ట్రాల నుండి 436 మంది చిన్నారులు పాల్గొనగా హనుమకొండ వారే 170 మంది ఉన్నారు. వీరం దరికీ కండువా, మెడల్, ట్రోఫీ, సర్టిఫికేట్ అందజేస్తున్నా మని తెలిపారు.. ఛాలెంజ్‌లో పాల్గొన్న పిల్లలతో జరిగే ఈ ఎగ్జిబిషన్‌ను పిల్లలు, పెద్దలు పెద్ద ఎత్తున సందర్శించి చిన్నారి ఆర్టిస్టులను దీవించాలని మంజుల కోరారు.

# నీటి ఎద్దడి లేకుండా కృషి

**- వెంకటాపూర్ సర్పంచ్ సెగ్గం వెంకటేష్ -**



**వాస్తవం, మందమర్రి ఫిబ్రవరి 20:**

మండలంలోని వెంకటాపూర్ గ్రామపంచాయతీ పరిధిలో నీటి ఎద్దడి లేకుండా కృషి చేసి రక్షిత మంచినీటి సౌకర్యం కల్పిస్తానని వెంకటాపూర్ సర్పంచ్ సెగ్గం వెంకటేష్ స్పష్టం చేశారు. శుక్రవారం గ్రామంలోని హనుమాన్ ఆలయం సమీపంలో బోరు మోటర్ చెడిపోయి నీటి సమస్య ఏర్పడడంతో నూతన మోటార్‌ను ప్రారంభించి మాట్లాడారు. ఆలయ సమీప ప్రాంతంలో గత కొన్ని రోజులుగా నీటి సరఫరాలో ఇబ్బందులు ఏర్పడి కాలనీవాసులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని వారి ఇబ్బందిని దృష్టిలో పెట్టుకొని నూతన మోటార్ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు అలాగే రానున్న వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని గ్రామంలో నీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపడుతున్నట్లు ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సిద్దుల రాజేశ్వరి వార్డ్ సభ్యులు వేల్పుల మహేశ్వరి - సాగర్, గ్రామస్థులు పాల్గొన్నారు.

# నిరాధార ఆరోపణలు సహించం

**-రూ.5 కోట్లు పరువునష్టం దావా**
**-మాజీ కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి**

**వాస్తవం : శేరిలింగంపల్లి, ఫిబ్రవరి 20 :**

గచ్చిబౌలి డివిజన్ మాజీ కార్పొరేటర్ వి. గంగాధర్ రెడ్డి తనపై జరిగిన అసత్య ప్రచారాలను తీవ్రంగా ఖండించారు. తన వ్యక్తిగత స్థలంలో చట్టబద్ధంగా నిర్మాణం చేస్తున్న ఇంటిని ప్రభుత్వ భూమి కబ్జా చేశానని ప్రచారం చేసిన వారిపై రూ.5 కోట్ల పరువునష్టం దావా వేసి, పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.ఒక యూట్యూబ్ ఛానల్ రిపోర్టర్ కావాలనే దుష్ప్రచారం చేస్తున్నాడని ఆరోపిస్తూ, రాజకీయ కక్షతో తన ప్రతిష్ఠను దెబ్బతీయాలని ప్రయత్నిస్తున్నారని పేర్కొన్నారు. అక్రమ వసూళ్లపై తన వద్ద ఆధారాలు ఉన్నాయని, చట్టపరంగా చర్యలు కొనసాగుతాయని స్పష్టం చేశారు. తక్షణమే బహిరంగ క్షమాపణ చెప్పాలని, లేకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. "సత్యమే గెలుస్తుంది-అసత్య ప్రచారాలకు చట్టపరంగా సమాధానం ఇస్తాం" అని అన్నారు.





## ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశంలో ఆది



**వాస్తవం : వేములవాడ**

వేములవాడ పట్టణంలో 14, 19 వార్డుల్లో నిర్మించిన ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశ కార్యక్రమంలో శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పాల్గొన్నారు.లబ్ధిదారులకు నూతన వస్త్రాలను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.పేదల సొంతింటి కలను నిజం చేయడం ప్రభుత్వ ధ్యేయమని అన్నారు.ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## గణాంక శాఖ ఆధ్వర్యంలో సర్వే



**వాస్తవం : వేములవాడ**

కరీంనగర్ గణాంక అధికారి గుర్రం శ్రీనివాస్ గౌడ్ జాతీయ గణాంక శాఖ 2026వ సంవత్సరానికి గాను ప్రజల ఉపాధి స్థితిగతులపై పిరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే నిర్వహిస్తున్న సర్వేల్లో భాగంగా వేములవాడ పట్టణంలో శుక్రవారం గణాంక శాఖ అధికారి గుర్రం శ్రీనివాస్ గౌడ్ సర్వే నిర్వహించారు.ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా పట్టణాలు గ్రామాలను ఎంపిక చేసుకుని ప్రజల ఉపాధి స్థితిగతులపై సర్వేలో భాగంగా మొదట సాధారణ వివరాలతో సర్వే చేసిన అనంతరం ట్యాబ్ ద్వారా పట్టణంలోని కొన్ని కుటుంబాలను ఎంపిక చేసి, మూడు నెలల పాటు నెలకు ఒకసారి పూర్తి సర్వే చేసి ప్రత్యేక ట్యాబ్‌లో వివరాలు నమోదు చేస్తామని గుర్రం శ్రీనివాస్ గౌడ్ తెలిపారు.ఈ కార్యక్రమంలో గణాంకశాఖ అధికారి గుర్రం శ్రీనివాస్ గౌడ్, వేములవాడ మున్సిపల్ కమిషనర్ కె సంపత్ కుమార్, మున్సిపల్ మేనేజర్ సంపత్ రెడ్డి, వేములవాడ తహశీల్దార్ జయంత్ కుమార్, ఎంపీడీవో బింగి కీర్తన,ఎంపీ ఎస్ఓ కురుకుంట్ల తిరుపతి,మున్సిపల్ బిల్ కలెక్టర్ జ్యోతి, శ్రీనివాస్, మున్సిపల్ మెప్మా సెక్షన్ సిబ్బంది ఆర్ పి ఎదురుగట్ల లక్ష్మి పాల్గొన్నారు.

# యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

**ఎన్ఎస్ఎస్ జిల్లా కన్వీనర్**
**మర్సకట్ల అనిల్ కుమార్**

**వాస్తవం : మరిపెడ**



విద్యార్థులు చదువుతో పాటు సేవా దృక్పథాన్ని అలవర్చుకోవాలనే ముఖ్య ఉద్దేశంతోనే ఎన్ఎస్ఎస్ కార్యక్రమాలు చేపడుతున్నామని ఎన్ఎస్ఎస్ జిల్లా కన్వీనర్ మర్సకట్ల అనిల్ కుమార్ అన్నారు. తెలంగాణ గిరిజన గురుకుల డిగ్రీ కళాశాల (బాలుర), మరిపెడ కళాశాల ఆధ్వర్యంలో ఆనేపురం గ్రామంలో నిర్వహిస్తున్న ప్రత్యేక శిబిరం కళాశాల ప్రిన్సిపల్ కె. ఉమారాణి అధ్యక్షతన ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ పి. ప్రచేతన్ ఆధ్వర్యంలో నిర్వహించబడింది. ఈ ప్రత్యేక శిబిరం 7 రోజులు పాటు పలురకాల కార్యక్రమాలు నిర్వహించబడును. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మర్సకట్ల అనిల్ కుమార్ హాజరై మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ సమాజాభివృద్ధిలో పోషిస్తున్న కీలక పాత్రను వివరించారు. యువతలో సేవాభావం, సామాజిక బాధ్యత, నాయకత్వ లక్షణాలను పెంపొందించడమే ఎన్ఎస్ఎస్ లక్ష్యమని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో స్వచ్ఛత, ఆరోగ్యం, విద్య, పర్యావరణ పరిరక్షణ వంటి రంగాల్లో ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు నిర్వహిస్తున్న సేవా కార్యక్ర మాలు సమాజానికి ఎంతో ఉపయోగప డుతున్నాయని పేర్కొన్నారు. అలాగే సమాజాన్ని వెనక్కి నెట్టే మూఢనమ్మకాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. డ్రగ్స్ దుర్వినియోగం యువత భవిష్యత్తును నాశనం చేస్తుం దని, మత్తు పదార్థాలకు దూరంగా ఉండి ఆరోగ్యకరమైన జీవనశైలిని అనుసరించాలని సూచించారు. బాల కార్మికత్వం, లింగ వివక్ష, సామాజిక అసమానతలు వంటి సామాజిక రుగ్మతల నిర్మూలనలో యువత కీలక పాత్ర పోషించాలని అన్నారు. ప్రిన్సిపల్ ఉమారాణి మాట్లాడుతూ ఈ ప్రత్యేక శిబిరం ద్వారా విద్యార్థుల్లో సామాజిక చైతన్యం పెరుగుతుందని, గ్రామాభివృద్ధికి కళాశాల--గ్రామ అనుబంధం మరింత బలపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ విజయశాంతి,ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ప్రచేతన్, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డా. సరిత,గ్రామ సర్పంచ్ వసుమతి యాకన్న, మాజీ సర్పంచ్ వీరన్న, గ్రామ సెక్రటరీ రామోజీ, స్కూల్ హెచ్ఎం పాషా, అధ్యాపకులు పాల్గొన్నారు.

## అంగన్వాడి టీచర్‌పై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు

**వాస్తవం : ఎల్లారెడ్డిపేట**



ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్ గ్రామంలో పది రోజు ల క్రితం కొంపెల్లి లక్ష్మి కొడుకు కొంపెల్లి విద్వాన్ష్(3)ని అదే గ్రామానికి చెందిన అంగన్ వాడీ టీచర్ సల్వాని రాణి అకారణంగా కొట్టగా అందిన ఫిర్యాదు మేరకు ఎల్లారెడ్డిపేట ఎస్ఐ కె రాహుల్ రెడ్డి కేసు నమోదు చేశారు.తదుపరి దర్యాప్తులో భాగంగా సాక్షులను విచారించగా నిందితురాలు కొంపల్లి విద్వాన్ష్‌ని కొట్టినందున అంగన్ వాడీ టీచర్ రాణిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

# గ్రామాల భద్రతకు నిఘా నేత్రాలు అనివార్యం

**హుస్నాబాద్ ఏసీపీ**
**సాదారపు సదానందం**

**వాస్తవం : హుస్నాబాద్ :**



గ్రామాలలో శాంతి భద్రతలు నెలకొల్పబడాలంటే నిఘా నేత్రాలు తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలని హుస్నాబాద్ ఏసీపీ సాదారపు సదానందం అన్నారు. శుక్రవారం హుస్నాబాద్ మండల పరిషత్ సమావేశ మందిరంలో గ్రామ సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులతో ప్రత్యేక అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. గ్రామాల అభివృద్ధి మరియు శాంతి భద్రతల పరిరక్షణపై ప్రజాప్రతినిధులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.... ప్రతి గ్రామంలోని ప్రధాన కూడళ్ళు, వీధుల వద్ద నిఘా నేత్రాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కొత్తగా విగ్రహాలను ప్రతిష్టించాలి అనుకుంటే సంబంధిత శాఖల అధికారుల నుండి ముందస్తు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిబంధనలు పాటించాలని కోరారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న యువత , ప్రజలు ట్రాఫిక్ నియమాలను పాటించేలా చూడాలని, హెల్మెట్ ధరించడం అతివేగాన్ని నియంత్రించడంపై సర్పంచులు అవగాహన కల్పించాలని చెప్పారు. అనంతరం ఎస్సై లక్ష్మారెడ్డి మాట్లాడుతూ .పోలీసులు మరియు ప్రజల మధ్య సత్సంబంధాలు ఉండాలని, గ్రామంలో అనుమానాస్పద వ్యక్తులు సంచరించినట్లయితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని స్పష్టం చేశారు.

## శ్రీ రేణుక ఎల్లమ్మ దేవాలయ నిర్మాణానికి భూమి పూజ



**వాస్తవం : కోనరావుపేట:** కోనరావుపేట మండలం మామిడిపల్లి గ్రామంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో నిర్మించే శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి దేవాలయం నిర్మాణ శుక్రవారం నిర్వహించే భూమి పూజ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆది శ్రీనివాస్ పాల్గొన్నారు. ప్రభుత్వ పరంగా అండగా నిలుస్తుందని, దేవాలయాన్ని త్వరితగతిన పూర్తి చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ పాలక వర్గం, గౌడ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

# సెక్యూరిటీ టెండర్లలో అక్రమాలు

**వాస్తవం : మందమర్రి ఫిబ్రవరి 20:**



ఏరియాలో 90 మంది అవుట్ సోర్సింగ్ సెక్యూరిటీ గార్డుల కేటాయింపు కోసం నిర్వహించిన టెండర్లలో భారీ అక్రమాలు జరిగాయని సిపిఐ పట్టణ కార్యదర్శి కామెర దుర్గ రాజ్ ఆరోపించారు. పట్టణ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజకీయ నాయకుల ఒత్తిళ్లకు తలొగ్గి అర్హత లేని సంస్థలకు టెండర్లు కట్టబెట్టేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. మాధవ్ సెక్యూరిటీ సర్వీస్, తిరంగ సెక్యూరిటీ అండ్ అవుట్ సోర్సింగ్ సర్వీసెస్ సంస్థలకు సరైన పత్రాలు లేవన్నారు. రాష్ట్ర మంత్రులు, నేతల అండతో అధికారులపై ఒత్తిడి తెచ్చి టెండర్ ఫైళ్లను వేగంగా కదిలిస్తున్నారని మండిపడ్డారు. ఎల్1 కాంట్రాక్టర్ టెండర్ డ్రా పద్ధతిలో ఎంపికైన తర్వాత హోమ్ డిపార్ట్మెంట్ కు చెందిన పసరా లైసెన్స్‌ను ఒక్క రోజులోనే సృష్టించి సమర్పించారన్నారు. వర్క్ ఆర్డర్ తేదీలు, జిఎస్టి వివరాలు పొంతన లేకుండా ఉన్నాయని, ఈఎస్ఐ, పిఎఫ్ బిల్లులు, బ్యాంక్ స్టేట్మెంట్లను నిశితంగా పరిశీలించాలని డిమాండ్ చేశారు. అధికారులు రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గకుండా పారదర్శకంగా టెండర్లు నిర్వహించి అర్హులైన వారికి టెండర్ కేటాయించాలని కోరారు.

# జీవించే హక్కును హరించడం తగదు

**డెబ్బైఐదు సంవత్సరాల భారత రాజ్యాంగంలో నేటికి దళితులపై వివక్షతే**

**డిబిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు చుంచు రాజేందర్**

**వాస్తవం : హనుమకొండ, ఫిబ్రవరి 20:**




వరంగల్ 11వ డివిజన్‌లోని భద్రకాళి ఆలయం ప్రధాన గేటుకు సమీపంలో ఉన్న చెరబండరాజు నగర వాసులు గత యాభై సంవత్సరాల నుండి సుమారు 45 కుటుంబాలు చిన్న,చిన్న గుడారాలు నిర్మించుకొని జీవనాన్ని కొనసాగిస్తున్న తరుణంలో దళిత కుటుంబాల జీవించే హక్కును హరించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం, స్థానిక శాసనసభ్యులు, భద్రకాళి దేవాదాయ శాఖ అధికారులు ప్రయత్నం చేస్తున్నారని,దేశానికి రాజ్యాంగం వచ్చి 75 ఏళ్ళు గడుస్తున్న,దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 78 సంవత్సారాలు దాటిన నేటికి దళితులు జీవన స్థితి మెరుగు పడటం లేదని దళిత కుటుంబాలను వెళ్ళగొట్టాలని చూస్తే దళితుల ఆగ్రహానికి గురికాక తప్పదని దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర ఉపాధ్యక్షులు, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు చుంచు రాజేందర్ రాష్ట్ర యంత్రాంగాన్ని హెచ్చరించారు. భద్రకాళి అమ్మవారి మాడవీధుల కోసం దళిత కుటుంబాలను వెళ్ళగొట్టి దళితుల ఇండ్లను పూర్తిగా నెలమట్టం చేసే విధంగా చూడటం భాదకరమన్నారు. భద్రకాళి అమ్మవారి దేవాలయం పక్కన దళిత కుటుంబాలు ఉంటే దేవాలయం మైల పడతాదనడం కుల వివక్షతలో భాగమేనని అన్నారు. దేవాదాయశాఖ అధికారులపై,వారికి సహాకరించే వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసులు నమోదు చేయాలని పోలీసులను కోరారు. చెరబండ రాజునగర్ లోని అంబేద్కర్ విగ్రహం వద్ద దళిత కుటుంబాలతో సమావేశం ఏర్పాటు చేశారు. సర్వే నెంబర్ 757 లో ఎకరం భూమిలో దళిత కుటుంబాలకు ఒక్కొక్కరికి 80 గజాల చొప్పున పట్టాలు ఇచ్చారని అన్నారు.కొందరు దళిత వ్యతిరేక వ్యక్తులు ఆలయం పక్కన దళితులు ఉండద్దు అనే ఉద్దేశ్యంతో కులవివక్షత పాటిస్తూ ఇలాంటి చర్యలకు ఒడిగడుతున్నారని చుంచు రాజేందర్ తెలిపారు.దళిత కుటుంబాలపై అధికారులు దూకుడుగా వ్యవహరించాలనుకోవడం హేయమైన చర్యని అన్నారు.ఈ కార్యక్రమములో పూలే సామాజిక న్యాయ వేదిక రాష్ట్ర అధ్యక్షు లు కేడల ప్రసాద్, చెరబండరాజు నగర్ కాలనీ వాసులు గన్నరాపు రాజు,జన్ను ప్రవీణ్,రాడపాక రేణుక, బస్కులా కుమార స్వామి,పెండల రమ్య, ఎర్ర ఎవజాలిన్, కొమురయ్య, బాబు పాల్గొన్నారు.

# ఏళ్ల కల... నెరవేరిన వేళ

**వాస్తవం: హుస్నాబాద్ :**



ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న గ్రామ ప్రజల కల నెరవేరింది. మండలంలోని తోటపల్లి గ్రామపంచాయతీ పరిధిలో గల పూస వేర్లపల్లెకు తారు రోడ్డు లేక అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ముఖ్యంగా వర్షాకాలంలో వాగు దాటాలంటే బావుల వద్దకు వెళ్లే రైతులకు వెళ్లలేని పరిస్థితి ఎదురయ్యేది. ఈ తరుణంలో హుస్నాబాద్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బంక చందు ఈ విషయాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన మంత్రి పొన్నం ప్రభాకర్ తోటపల్లి నుండి పూస వేర్ల పల్లెకు తారు రోడ్డుకు మరియు బ్రిడ్జికి సంబంధించి సుమారు 2 కిలో మీటర్ల మేర ఉన్న మట్టి రోడ్డుకు రూ.2 కోట్ల 53 లక్షలు మంజూరు చేశారు. దీంతో తోటపల్లి నుండి పూస వేర్లపల్లెకు శుక్రవారం తోటపల్లి గ్రామ సర్పంచ్ బంక లక్ష్మి చందు ఉప సర్పంచ్ పోలు రాజు, వార్డు సభ్యులు పనులు ప్రారంభించారు. ఏళ్ల కలకు అంకురార్పణ జరుగుతుండడంతో గ్రామ ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. అలాగే తారు రోడ్డుకు, బ్రిడ్జికి నిధుల మంజూరుకు చొరవ చూపిన రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు తోటపల్లి, పూస వేర్లపల్లి గ్రామ ప్రజలు, రైతులు కృతజ్ఞతలు తెలియజేశారు.

**ముదిరాజ్ సంఘ భవనానికి**

# ప్రత్యేక నిధులు

**ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి**



**వాస్తవ : లక్ష్మణ చందా**

మండలంలోని రాచాపూర్ గ్రామంలో ముదిరాజ్ సంఘ భవనం నిర్మాణం కొనసాగుతోంది. గతంలో ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో చేపట్టిన ఈ నిర్మాణానికి ప్రత్యేక నిధులు కేటాయించారు. మరింత నిర్మాణం చేపట్టే దిశగా శుక్రవారం రోజున మరో పది లక్షలు మంజూరు చేసినట్టు ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి తెలిపారు. ఎస్డిఎఫ్ నిధుల కింద ఐదు లక్షలు, ఎంపీ నిధుల కింద ఐదు లక్షల రూపాయలను మంజూరు చేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి బన్నేపోయిన పోశెట్టి, నాయకులు బన్నబోయిన పోశెట్టి, బన్నేబోయిన రాజన్న, భూసి పెంటాజి, భూసి సురేష్, గజ్జల బోర్రన్న తదితరులు పాల్గొన్నారు.

# ఆదిల్ పేటలో పిచ్చి మొక్కల తొలగింపు



**వాస్తవం, మందమర్రి ఫిబ్రవరి 20:**

మండలంలోని ఆదిల్ పేట గ్రామంలో రహదారి కిరువైపులా ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలు, చెట్ల పొదలు తొలగింపు పనులను గ్రామ సర్పంచ్ నిండుగురి పున్నం శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామం నుండి చిర్రకుంట గ్రామానికి వెళ్లే రహదారికి ఇరు వైపులా పిచ్చి మొక్కలు ఏపుగా పెరగడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. పిచ్చి మొక్కలు రోడ్డుపైకి వస్తుండడం దీనికి తోడు మూల మలుపుల వద్ద ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజల, వాహనదారుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని పిచ్చి మొక్కల తొలగింపు కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు.



# నేషనల్ హైవే ప్రాజెక్టుకు భూసేకరణ వేగవంతం చేయాలి

**- కలెక్టర్ రాహుల్ శర్మ**



వాస్తవం : భూపాలపల్లి

భూపాలపల్లి జిల్లాలో చేపట్టనున్న గ్రీన్ ఫీల్డ్ నేషనల్ హైవే ప్రాజెక్టుకు సంబంధించిన భూసేకరణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఐడిఓసి కార్యాలయంలో గ్రీన్ ఫీల్డ్ నేషనల్ హైవే పనులకు భూ సేకరణపై రెవెన్యూ, గ్రీన్ ఫీల్డ్ నేషనల్ హైవే అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఈ ప్రాజెక్టు ద్వారా జిల్లాకు రవాణా సౌకర్యాలు మెరుగుపడటంతో పాటు పారిశ్రామిక అభివృద్ధికి దోహదపడుతుందని తెలిపారు. భూసేకరణ ప్రక్రియలో ఎటువంటి ఆలస్యం లేకుండా, భూ యజమానులకు చట్టబద్ధంగా పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రెవెన్యూ, నేషనల్ హైవే, సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి నిర్దేశిత గడువులోపు భూసేకరణ పూర్తి చేయాలని ఆదేశించారు. భూ యజమానులతో చర్చలు జరిపి వారి సందేహాలను నివృత్తి చేయాలని, పారదర్శకంగా ప్రక్రియ నిర్వహించాలని తెలిపారు. ప్రాజెక్టు అమలులో ప్రజల సహకారం కీలకమని, అధికారులు ప్రజలతో సానుకూలంగా వ్యవహరించాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, ఆర్డీఓ హరికృష్ణ, గ్రీన్ ఫీల్డ్ నేషనల్ హైవే పీడీ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సంక్షేమమే ధ్యేయం

**మాజీ కార్పొరేటర్ గంధం జోత్స్నా నాగేశ్వరావు**



**వాస్తవం : ఉప్పల్:** రామంతాపూర్ డివిజన్ పరిధిలో దోమల బెడదతో ప్రజలు పడుతున్న ఇబ్బందులను మాజీ కార్పొరేటర్ గంధం జోత్స్నా నాగేశ్వరావు తక్షణమే స్పందిస్తూ గంధం ఫౌండేషన్ ఆధ్వర్యంలో,స్వచ్ఛందంగా కొనుగోలు చేసిన కొత్త దోమల ఫాగింగ్ మిషన్లను 2ఉప్పల్ సర్కిల్ ఆఫీస్‌లో డిప్యూటీ కమిషనర్ రాజుకి అందజేశారు.ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతున్న మాజీ కార్పొరేటర్ జోత్స్నా నాగేశ్వరావుకు ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసీ ఎంటమాలజీ ఎస్సీ మాధవరెడ్డి,డిఈ సాయి తరుణ్ ,ఏఈ భారతి,బిఆర్ఎస్ నాయకులు రామ సహాయం శ్రీనివాస్ రెడ్డి, సురం శంకర్,చాంద్ పాషా,తూట్ నరసింహా, మనీష్,మద్దూరి శ్రీను,మందపాటి శ్రీనివాస్ రెడ్డి, లడ్డు, గౌతమ్,పవన్,ప్రవీణ్,ప్రశాంత్,తదితరులు పాల్గొన్నారు.

## చదువుల 'సిరి' ఉన్నా..

# విధి రాతలో 'భిక్షాటన'

**వేములవాడ రాజన్న సన్నిధిలో కన్నీటి గాథలు**

వాస్తవం : వేములవాడ

వేములవాడ పుణ్యక్షేత్రం వేములవాడలో ఆపదలో ఉన్నవారిని ఆదుకునే ఆ రాజరాజేశ్వరుని సన్నిధిలో ఇప్పుడు ఒక దీన గాథ అందరిని కంటతడి పెట్టిస్తోంది. కాన్వెంట్ చదువులు, ఉన్నత డిగ్రీలు ఉన్నా.. కాలం చేసిన గాయానికి ఆ దంపతులు బాత్ రూమ్ పనులు, కొబ్బరికాయలు కొట్టడం, నేడు యాచకులుగా మారారు.అనర్గళంగా ఇంగ్లీష్‌తో అధికారులు ఆశ్చర్యపోయారు. వేములవాడ ఆలయ పరిసరాల్లో భిక్షాటన చేస్తున్న వారికి పోలీసులు, అధికారులు కలిసి ఇటీవల కౌన్సిలింగ్ నిర్వహించారు. ఆ గుంపులో ఉన్న ఒక జంటను పలకరించిన అధికారులకు నోట మాట రాలేదు. వారు మాట్లాడుతున్న అనర్గళమైన ఇంగ్లీష్, వారి ఆహార్యం చూసి అవాక్కయ్యారు.భర్త జలంధర్ రెడ్డి న్యాయ శాస్త్ర పట్టా పూర్తి చేసిన విద్యావంతుడు. భార్య శిరీష బీకాం కంప్యూటర్స్ చదివిన పట్టభద్రురాలు.కరీంనగర్‌కు చెందిన ఈ దంపతులు ఇక్కడికి ఎందుకు వచ్చారో తెలిస్తే ఎవరికైనా గుండె తరుక్కు పోతుంది. భార్య ఆరోగ్యం క్షీణించడంతో ఆమెకు తోడుగా ఉంటూ.. వేములవాడ రాజన్న దిక్కని నమ్మి ఇక్కడికి వచ్చారు. చిన్న చిన్న పనులు చేసుకుంటూ ఆ దేవుడి ప్రసాదంతోనే కడుపు నింపుకుంటున్నారు. నేటి కాలంలో చిన్న కారణాలకే విడిపోతున్న జంటల మధ్య భార్య కోసం సర్వం వదులుకుని అండగా



నిలిచిన ఆ భర్త ప్రేమ చూసి అధికారులు సైతం భావోద్వేగానికి లోనయ్యారు.

**ఆస్తులున్నా.. ఆదరణ కరువైన వృద్ధులు.**

కేవలం ఈ దంపతులే కాదు.. అక్కడ సుమారు 100 మందికి పైగా యాచకులు ఉన్నారు. వారిలో అత్యధికులు వృద్ధులే. వారి గాథలు వింటే సమాజం ఎటు వెళ్తుందో అర్థం కావట్లేదు. కన్న పిల్లల వేధింపులు, కొందరు కొడుకులు, కోడళ్లు పెడుతున్న హింస భరించలేక ఇక్కడికి చేరారు.భయం నీడలో ఇంటికి వెళ్తే పిల్లలు కొట్టి చంపుతారేమో అనే భయంతో రాజన్నను ఆశ్రయించారు. దిక్కులేని స్థితి, ఆస్తులు అంతస్తులు ఉన్నాయి.కానీ మమ్మల్ని ప్రేమించే మనసున్న మనుషులు లేరు. అందుకే మా రాజన్నే మమ్మల్ని సాదుతున్నాడు అంటూ ఆ వృద్ధులు బోరున విలపించడం అక్కడి వాతావరణాన్ని విషాదంలోకి నెట్టింది.

**అధికారుల భరోసా- వేధించే వారిపై కఠిన చర్యలు**

రాజన్న సిరిసిల్ల జిల్లా అదనపు ఎస్పీ చంద్రయ్య మాట్లాడుతూ.. ఆలయ పరిసరాల్లో భిక్షాటన నిషేధమని, అయితే సమస్యల సుడిగుండంలో చిక్కుకున్న వారికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు.వృద్ధులను ఆదరించకుండా వీధుల్లోకి నెట్టే పిల్లలపై, వారిని వేధించే బంధువులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటాం. కౌన్సిలింగ్ ద్వారా వారిని తిరిగి తమ ఇళ్లకు పంపేలా ప్రయత్నిస్తామని పేర్కొన్నారు.ఉన్నత చదువులు చదివిన జలంధర్ రెడ్డి, శిరీష దంపతుల బంధం కథ మన విద్యావ్యవస్థకు, సమాజానికి గుణపాఠం నిరూపిస్తోంది.

## పంటల సాగులో ఆధునిక పద్ధతులు పాటించాలి

**మండల వ్యవసాయ అధికారి స్రవంతి**



**వాస్తవం : మనోహరాబాద్:**

పంటల సాగులో ఆధునిక పద్ధతులు పాటించాలని మండల వ్యవసాయ అధికారి స్రవంతి అన్నారు. మనోహరాబాద్ మండలంలోని కోనాయిపల్లి పిటి గ్రామంలో రైతు తప్పేట సాయిబాబా వెదజల్లే పద్ధతిలో వేసిన వరి నాటును శుక్రవారం వ్యవసాయ అధికారి స్రవంతి పరిశీలించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంట జీవన దశలు,తెగుళ్లు,పురుగుల నివారణ,పోషకాలలో పాలు అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు.రైతులు విభిన్న పద్ధతులు పాటించడం వల్ల అధిక దిగుబడి వచ్చే అవకాశం ఉందని తెలిపారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు రైతులు పాల్గొన్నారు.

**తెలంగాణ హ్యూమన్ రైట్స్ జస్టిస్ ఫోరమ్‌కు**

# నాదెండ్ల నాగరాజు నియామకం



**వాస్తవం : ఉప్పల్:** తెలంగాణ రాష్ట్రాల్లో కార్యకలాపాలు కొన సాగిస్తున్న తెలంగాణ హ్యూమన్ రైట్ జస్టిస్ ఫోరమ్ తెలంగాణ ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా నాగరాజు నాదెండ్లను నియమించినట్లు సంస్థ ఛైర్ పర్సన్ డాక్టర్ వ్యాసభట్ శ్రీవాణి చౌదరి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు నాగరాజు నాదెండ్ల సంస్థలో తెలంగాణ ఎగ్జిక్యూటివ్ మెంబర్స్‌గా నియమితులైన సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు.నా మీద నమ్మకం ఉంచి ఈ బాధ్యతను అప్పగించిన ఛైర్ పర్స న్ డాక్టర్ వ్యాసభట్ శ్రీవాణి చౌదరి మా నియామకానికి కృషి చేసిన జట్ల పద్మావతి, జనరల్ సెక్రటరీ తెలంగాణ లకు కృతజ్ఞతలు తెలియజేశారు.మానవ హక్కుల పరిరక్షణ కోసం నా శక్తి మేరకు పనిచేస్తానని,బాధితులకు అండగా నిలిచి న్యాయం జరిగేలా నిరంతరం కృషి చేస్తానన్నారు.

**రేపు పోచమ్మ ఆలయంలో**

# నగర సంకీర్తన

వాస్తవం : సంగారెడ్డి జిల్లా ప్రతినిధి

జహీరాబాద్ హరేకృష్ణ మూమెంట్ ఆధ్వర్యంలో ఈ నెల 22న ఆదివారం ఉదయం 6 గంటలకు పట్టణంలోని సాయిరాం కాలనీ పోచమ్మ ఆలయంలో 195వ నగర సంకీర్తన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆ సంస్థ బాధ్యులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. హరేకృష్ణ మహామంత్ర జపం, ప్రభుపాదుల ప్రార్థన, కీర్తనలతో శోభాయమానంగా కొనసాగనుందని తెలిపారు. హోళీ మాసం సందర్భంగా భక్తులు వివిధ రకాల పూవులతో సంబరాలు జరుగుతాయని, భక్తులు సాంప్రదాయ వస్త్రధారణతో రావడమే కాకుండా తమ వెంట పూవులు తీసుకురావాలని కోరారు. తదనంతరం సంగారెడ్డి జిల్లా కంది హరేకృష్ణ టెంపుల్ బాధ్యుల ద్వారా సత్సంగ



ప్రవచనం, నరసింహ ఆరతి, ప్రసాద వితరణ ఉంటుందని వివరించారు.

# మహిళా సంఘం నూతన భవన నిర్మాణానికి భూమి పూజ

## సర్పంచ్ శివగౌని పెంటా గౌడ్

**వాస్తవం : మనోహరాబాద్ :**

మనోహరాబాద్ మండలంలోని లింగారెడ్డిపేట గ్రామంలో మహిళా సంఘం నూతన భవనం నిర్మాణం కొరకు రూ. 10 లక్షల ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో శుక్రవారం తెలంగాణ రాష్ట్ర సర్పంచుల ఫోరం ఉపాధ్యక్షులు శివగౌని పెంటా గౌడ్ పాలకవర్గ సభ్యులతో కలిసి భూమి పూజ చేసి కొబ్బరికాయ కొట్టారు.ప్రజల సంక్షేమం,గ్రామ అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తానని సర్పంచ్ పెంటా గౌడ్ అన్నారు. ఈ కార్యక్రమంలో పిఆర్ ఏ ఈ మధు, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, ఉప సర్పంచ్ లక్ష్మి,పాలకవర్గ సభ్యులు తిరుపతి గౌడ్,రాజు,షేక్ షాలీ మా, స్వర్ణ,గ్రామస్తులు సురేందర్ రెడ్డి, శేఖర్ గౌడ్,వెంకట్ చారి పాల్గొన్నారు.



# ఆర్థిక పునరావస సహాయానికి దివ్యాంగులకు ఇంటర్వ్యూలు

**రాజన్న సిరిసిల్ల జిల్లా ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**వాస్తవం: రాజన్న సిరిసిల్ల (ప్రతినిధి)**

ఆర్థిక పునరావాస సహాయ పథకానికి సంబంధించి జిల్లాలోని ఆయా మండలాల నుంచి దరఖాస్తు చేసుకున్న దివ్యాంగులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. దివ్యాంగుల ఆర్థిక సహాయ పునరావాస పథకం కింద జిల్లాకు 14 యూనిట్లు మంజూరు కాగా ఒక్కో యూనిట్ విలువ రూపాయలు రూ.50,000 వేలు వంద రాయితీ ఉంటుంది. జిల్లాలోని ఆయా మండలాలకు చెందిన 38 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం లో శుక్రవారం దివ్యాంగులకు రాజన్న సిరిసిల్ల జిల్లా ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. 37 మంది దివ్యాంగులు హాజరుకాగా, వారికి సంబంధించిన సర్టిఫికెట్లు, అర్హతలు పరిశీలించి వారి వివరాలు అడిగి తెలుసుకున్నారు.ఈ ఇంటర్వ్యూలో డీఆర్ డీఓ గీత, జిల్లా సంక్షేమ అధికారి పి లక్ష్మీరాజం, ఎస్సీ కార్పొరేషన్ అధికారి స్వప్న, ఏవో మెప్మా మీర్జా ఫసహత్ అలీ బేగ్ ఉన్నారు.



# ఉత్త మంత్రిగా ఉత్తమ్ కుమార్

**- సాగు నీళ్లు విడవడానికి ఆంక్షలా**

**- మేము ప్రాజెక్టులు నిర్మిస్తే మీరు కాలువల మట్టి కూడా తీయరా**

**- దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి**

**వాస్తవం, దౌల్తాబాద్**



ప్రాజెక్టుల నిర్మాణం కోసం త్యాగం చేసిన ప్రాంతం మాది.. ఎందరో త్యాగాల పునాదుల మీద కెసిఆర్ గారి ఆకుంఠత దీక్ష తో ప్రాజెక్టుల నిర్మించుకొని నీళ్లు విడుదల చేసుకున్నాం..ఈ త్యాగాల గడ్డకు ఎమ్మెల్యే హోదాలో నేడు నీళ్లు విడుదల చేయాలంటే కాంగ్రెస్ ప్రభుత్వం ఆంక్షలు విధిస్తుందని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు..సిద్దిపేట జిల్లా రాయపోల్ మండలం మంతూర్ -అనాజీపూర్ శివారులో 13డి కాలువలో గోదావరి జలాలకు రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమీషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య తో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మా నియోజక వర్గం పరిధిలో సాగు నీరు అందించే 13డి (రామాయంపేట)కాలువ నుండి నీళ్లు విడుదల చేస్తామంటే రాత్రి నుండి కలెక్టర్ కార్యాలయం నుండి,ఏసీపీ, నీటి పారుదల శాఖ నుండి అధికారులు ఫోన్లు చేసి రాజకీయ ఒత్తిడి ఉందని కార్యక్రమంను అడ్డుకొని వారే విడుదల చేశారన్నారు.కెసిఆర్ హయాంలో తాము ప్రాజెక్టులు, ప్రధాన కాలువలు నిర్మిస్తే.. కాంగ్రెస్ ప్రభుత్వం కనీసం కాలువలలో పూడిక కూడా తీయడం లేదని విమర్శించారు..నీళ్లు వొస్తాయనే ఆశతో రైతులు సాగుచేసుకుంటే కాలువ నుండా పూడిక ఉండటంతో రైతులు తలా కొంత వేసుకొని పూడిక తీసుకోవడం జరిగిందన్నారు. రెండున్నర ఏళ్లుగా సిద్దిపేట జిల్లా సాగునీటి సమస్యలపై సమీక్ష నిర్వహించని భారీ నీటిపారుదల శాఖ మంత్రివర్యులు ఉత్తమ్ కుమార్ రెడ్డి ఉత్త మంత్రిగా మిగిలిపోయాడన్నారు..రెండేళ్లుగా ఉప కాలువలు నిర్మించాలని అసెంబ్లీ సాక్షిగా గళ మెత్తనా ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. దుబ్బాక అంటేనే వ్యవసాయ నియోజకవర్గమని ఇక్కడ ప్రతి ఎకరాకు సాగునీరు అందించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఉప కాలువల నిర్మాణం కోసం భూ సేకరణ, పరిహారం, నిర్మాణం అంశాలపై సీఎం రేవంత్ రెడ్డి వెంటనే స్పందించి పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. కెసిఆర్ హయాంలో ఇర్కోడు ఎత్తి పోతల ప్రాజెక్టుకు రూ. 111 కోట్లు మంజూరు అయిన ప్పటికీ ఇర్కోడు లిఫ్ట్ ఇరిగేషన్ పనులు నత్త నడకన సాగుతు న్నాయని అసంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే నియోజకవర్గంలోని ఉప కాలువలు పూర్తి చేసి రైతాంగానికి నీళ్లు ఇవ్వాలని లేని పక్షంలో తెలంగాణ ఉద్యమం తరహా మరో ఉద్యమం నిర్మిస్తామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమం మంతూర్ స్థానిక సర్పంచ్ పర్వేజ్, అనాజీపూర్ సోమని నిర్మల ఇస్తారీ .గాజుల పల్లి సర్పంచ్ పంజా స్వామి.ఇరిగేషన్ డీఈ దిప్తి.ఏఈ సుమన్. సైడ్ ఇంజనీర్ సందీప్.బీఆర్ఎస్ నాయకులు రణం శ్రీనివాస్ గౌడ్. వెంకట్ రెడ్డి.ఇప్ప దయాకర్.బార్గవ్. లింగం.తౌట కమాలకర్ రెడ్డి. సర్పంచ్లు, నాయకులు పాల్గొన్నారు.

# డాకుర్లో బీరప్ప స్వామి విగ్రహ ప్రతిష్ట ధ్వజస్తంభ స్థాపన



**వాస్తవం : ఆందోల్**

అందోల్ మండలం డాకూర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన బీరప్ప స్వామి గుడిలో బీరప్ప స్వామి విగ్రహ ప్రతిష్ట ధ్వజస్తంభ ప్రతిష్ట భక్తిశ్రద్ధలతో జరిగింది డాకూర్. గొల్ల కురుమల సంఘం ఆధ్వర్యంలో గత మూడు రోజులుగా వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు, యజ్ఞాలు హోమాలు భక్తిశ్రద్ధలతో జరుగుతున్నాయి. శుక్రవారం విగ్రహ ప్రతిష్ట ధ్వజ స్తంభ ప్రతిష్ట అత్యంత భక్తిశ్రద్ధలతో వేలాది మంది భక్తులు హాజరు కాగా కనుల పండుగగా సాగింది. వేలాది మంది భక్తులకు అన్న ప్రసాదం వితరణ చేశారు. ఈ కార్య క్రమంలో డాకూర్ గొల్ల కురుమల సంఘం నాయకులు గ్రామస్తులు పాల్గొన్నారు.

# నూతన వధూవరులను ఆశీర్వదించిన వెల్దండ వెంకటేష్



**వాస్తవం : జూబ్లీహిల్స్**

జూబ్లీహిల్స్ డివిజన్, ఫిల్మ్ నగర్‌లోని దీన్ దయాల్ నగర్ వాసులు లక్ష్మీ, గురవయ్య దంపతుల కుమారుడు రాజేష్ వివాహము నిరిషతో షేక్ పెట్ లోని దర్గాలోని ఎం ఎస్ కన్వెన్షన్ హాల్‌లో శుక్రవారం జరిగింది. ఈ వివాహ మహోత్సవ కార్యక్రమంకు ముఖ్య అతిథిగా హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు జూబ్లీహిల్స్ డివిజన్ కార్పొరేటర్ ( మాజీ )వెల్దండ వెంకటేష్.నూతన దంపతుల దాంపత్య జీవితం ఆనందం, ఆయుష్షు, ఐశ్వర్యాలతో నిండాలని ఆకాంక్షించి ఆశీర్వదించారు.

# జైపాల్ రెడ్డిని పరామర్శించిన సిపిఐ నాయకులు



**వాస్తవం : రాజేంద్రనగర్**

రంగారెడ్డి జిల్లా ఏఐటీయూసీ కార్యదర్శి తెలంగాణ మున్సిపల్ సంఘం రాష్ట్ర కార్యదర్శి వనంపల్లి జయపాల్ రెడ్డిని పరామర్శించిన రంగారెడ్డి జిల్లా సిపిఐ నాయకులు. జైపాల్ రెడ్డి తల్లి జంగమ్మ అకాల మరణానికి చింతిస్తూ వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. శుక్రవారం సిపిఐ రంగారెడ్డి జిల్లా సమితి సభ్యులు జే. ఆనంద్ గౌడ్, సహాయ కార్యదర్శి జే. విజయ్ ఆనంద్ గౌడ్, రంగారెడ్డి జిల్లా గౌడ సంఘం అధ్యక్షులు జే. సదానందం గౌడ్ నాగర్ కర్నూల్ బల్లాన్ పల్లి గ్రామంలోని జైపాల్ రెడ్డి నివాసానికి వెళ్లి పరామర్శించి ధైర్యం చెప్పారు.

# అభివృద్ధి పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే



వాస్తవం : రాజేంద్రనగర్

రాజేంద్రనగర్ నియోజకవర్గం లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్. శుక్రవారం మైలర్దేవ్ పల్లి డివిజన్ లోని హౌసింగ్ బోర్డ్ కాలనీలో పర్యటించారు. సుమారు 9 కోట్ల 80 లక్షల వ్యయంతో కూడుకున్న సిసి రోడ్, అండర్ డ్రైనేజీ పనులకు అధికారులు, స్థానిక నాయకులతో కలిసి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..మైలార్దేవ్‌పల్లి డివిజన్‌లోని కాలనీలలో మౌలిక సదుపాయాలకు నిరంతరం కృషి చేస్తున్నా మన్నారు. నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా ముందుకు వెళుతున్నామని పేర్కొన్నారు. ప్రభుత్వ సహకారంతో అభివృద్ధి పనులు త్వరత గతిన పూర్తిచేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.ప్రజా సమస్యలను తెలుసుకుంటూ దశలవారీగా పరిష్కరిస్తామని వెల్లడించారు.ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు,కాలనీవాసులు పాల్గొన్నారు.

# సమానహక్కులు,అవకాశాలకు న్యాయం అందించాలి

### లోక్ అదాలత్ సభ్యులు ఆడెపు వేణు

వాస్తవం : సిరిసిల్ల



సమాజంలోని ప్రతి వర్గానికి సమాన హక్కులు, అవకాశాలకు న్యాయం అందించాల్సిన అవసరం ఉందని లోక్ అదాలత్ సభ్యులు, న్యాయవాది ఆడెపు వేణు అన్నారు.జిల్లా న్యాయ సేవాధికర సంస్థ ఆధ్వర్యంలో జిల్లా న్యాయ సేవాధికర సంస్థ అధ్యక్షురాలు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి పినీరజ ఆదేశాలతో సీనియర్ సివిల్ జడ్జి, కార్యదర్శి పి లక్ష్మణాచారి సమన్వయంతో శుక్రవారం సిరిసిల్ల శివారు తంగళ్లపల్లి లోని తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ డిగ్రీ కాలేజీ (మహిళ), సిరిసిల్లలో రాజనీతి శాస్త్ర విభాగం సహకారంతో ప్రపంచ సామాజిక న్యాయ దినోత్సవం ను పురస్కరించుకొని న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు.ఈ సందర్భంగా ఆడెపు వేణు మాట్లాడుతూ.... ప్రపంచవ్యాప్తంగా ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 20న ప్రపంచ సామాజిక న్యాయ దినోత్సవంను జరుపుకుంటామని, సమానత్వం, సమగ్ర అభివృద్ధి, మానవ హక్కుల పరిరక్షణ ,సామాజిక న్యాయం సాధన లక్ష్యంగా ఈ దినోత్సవాన్ని ఆచరిస్తున్నామని తెలిపారు.పేదలు,మహిళలు,పిల్లలు, దివ్యాంగులు,వెనుకబడిన వర్గాలకు న్యాయ సహాయం, విద్య, ఉపాధి అవకాశాలు అందేలా చర్యలు తీసుకోవాలని పిలుపునిచ్చారు. సామాజిక న్యాయం అనేది కేవలం చట్టపరమైన హక్కుల పరిమితిలో కాకుండా, ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాలలో సమాన అవకాశాలు కల్పించడంలో కూడా ప్రతిఫలించాలని అన్నారు. ఈ సదస్సులో అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ఈజ్యోతి, న్యాయవాదులు గుర్రం ఆంజనేయులు, కడగండ్ల తిరుపతి,అరుణ,రాజనీతి శాస్త్ర విభాగ అధ్యాపకురాలు నవ్యశ్రీ , విద్యార్థినిలు పాల్గొన్నారు.

### సీతారామాంజనేయ స్వామి దేవస్థానంలో

# పునఃప్రతిష్ఠ మహోత్సవం

### పాల్గొన్న డిసిసి అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్ మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్

మేడిపల్లి : వాస్తవం





శ్రీ సీతారామాంజనేయ స్వామి దేవస్థానంలో పునఃప్రతిష్ఠ మహోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి ఈ కార్యక్రమానికి డీసీసీ సీతారామాంజనేయ స్వామి దేవస్థానం లో పునఃప్రతిష్ఠ మహోత్సవాలలో హాజరవ్వడం జరిగింది.గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బోడుప్పల్ పరిధిలోని ఈ ఆలయంలో ఈ రోజు కళ్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. నిర్వాహకుల ఆహ్వానం మేరకు కార్యక్రమానికి మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అలాగే బోడుప్పల్ మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్ తమ దంపతులతో కలిసి కార్యక్రమంలో పాల్గొన్నారు.వీరితో పాటు పలువురు స్థానిక ప్రముఖులు,ప్రజాప్రతినిధులు,భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య స్వామివారి కళ్యాణం నిర్వహించారు.ప్రత్యేక అలంకరణలతో ఆలయం భక్తుల సందడితో కళకళలాడింది.భక్తులకు తీర్థప్రసాదం అన్నదానం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఆలయాలు కేవలం ఆధ్యాత్మిక కేంద్రమే కాక సామాజిక ఐక్యతకు ప్రతీకలని పేర్కొన్నారు. ఇలాంటి పునఃప్రతిష్ఠ, మహోత్సవాలు ప్రజల్లో సత్సంకల్పాలను పెంపొందించడంతో పాటు సంస్కృతి,సంప్రదాయాలను పరిరక్షించడంలో ముఖ్య పాత్ర పోషిస్తాయని తెలిపారు.భక్తులు అధిక సంఖ్యలో హాజరుకావడం ఆనందకరమని అన్నారు.

### ప్రకృతి వ్యవసాయంపై

# రైతులకు అవగాహన



వాస్తవం : చందుర్తి

చందుర్తి మండలం తిమ్మాపూర్ గ్రామంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం గ్రామ సర్పంచ్ కాపిల్ల శంకర్ అధ్యక్షతన వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయం పైన అవగాహన,దిశ నిర్దేశం కార్యక్రమం నిర్వహించి రైతులకు అవగాహన కల్పించారు. గ్రామ రైతులు ప్రకృతి వ్యవసాయం పైన దృష్టి సారించాలని, రసాయనాలను తగ్గించి సహజంగా ఉపయోగించే జీవామృతం,బీజామృతం,ఆవు పేడ, ఆవు మూత్రం వంటి సహజ ఎరువులను వాడుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి దుర్గరాజు,వ్యవసాయ విస్తరణ అధికారి ప్రవీణ్, కృషి సఖీలు అనూష,గంగాజల,సేంద్రియ ఆదర్శ రైతు సూత్రం కరుణాకర్, రైతులు పాల్గొన్నారు.

### రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ మెంబర్ భూపాలపల్లి జిల్లా పర్యటన



వాస్తవం : భూపాలపల్లి

భూపాలపల్లి జిల్లాలోని పలు పాఠశాలలను, మరియు హాస్పిటల్ ను విజిట్ చేయుటకు వచ్చిన అధికారికి జిల్లా అడిషనల్ కలెక్టర్ విజయలక్ష్మి మరియు జిల్లా మహిళా సంక్షేమ శాఖ అధికారి మల్లేశ్వరి పుష్పగుచ్ఛంతో స్వాగతం తెలిపారు.తదనంతరంబాలల హక్కుల కమిషన్ మెంబర్ బోర్ర వచన్ కుమార్ శుక్రవారం భూపాలపల్లి లోని మహాత్మ జ్యోతిరావు పూలే బాలికల పాఠశాలను, అంగన్వాడి సెంటర్ ను, మైనార్టీ బాలుర పాఠశాలను, ప్రభుత్వ హాస్పిటల్ ను, సింగరేణి ఏరియా హాస్పిటల్ ను, చైల్డ్ కేర్ ఇన్స్టిట్యూషన్స్ కాటారం ను సందర్శించి, బాలల భవిష్యత్తు కోసం, వారి హక్కుల కోసం ప్రతి ఒక్క డిపార్ట్మెంట్ బాధ్యతగా విధి నిర్వహించాలని, నేటి బాలలే రేపటి పౌరులుగా నవ సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ నడుం బిగించి భవిష్యత్ తరాన్ని బాగు చేయాలని తెలియజేయడం జరిగింది. హాస్పటల్లో బాల రోగుల బాగోగులు తెలుసుకొని వారికి మెరుగైన వైద్యం అందించాలని డీ ఎమ్ ఒహెచ్ ఓ కు సూచనలు ఇవ్వడం జరిగింది. అలాగే మైనారిటీ పాఠశాలలోని విద్యార్థిని విద్యార్థులకు హెల్త్ చెకప్ చేయాలని పాఠశాల కళాశాల ప్రిన్సిపాల్‌కు సూచనలు ఇవ్వడం జరిగింది. అంగన్వాడిలోని పౌష్టికాహారం ప్రతి బాలలకు అందే విధంగా చూడాలని సిడిపిఒ కు మరియు సూపర్వైజర్ కు వివరించడం జరిగింది.ఇట్టి కార్యక్రమంలో భూపాలపల్లి జిల్లా చైల్డ్ వెల్ఫేర్ చైర్మన్ అనిల్ చంద్రరావు, జిల్లా డిఎం అండ్ హెచ్ ఓ మధుసూదన్ డిప్యూటీ సూపరింటెంట్ వెంకటరత్నం బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ ఇందిరా ల్, వెటర్నరీ డాక్టర్ కుమారస్వామి, చైల్డ్ హెల్ప్ లైన్ కోఆర్డినేటర్ తిరుపతి మరియు చైల్డ్ హెల్ప్ లైన్ విభాగం సిబ్బంది ఇట్టి కార్యక్రమం లో పాల్గొన్నారు అని జిల్లా సంక్షేమ అధికారి మల్లేశ్వరి తెలిపారు తెలిపారు.

# రైతుల జీవనధార కాళేశ్వరం ప్రాజెక్ట్

**మండుటెండల్లోనూ గోదావరి జలాలు పారించిన కేసీఆర్**
**కొండపోచమ్మ, మల్లన్న సాగర్‌లతో బీడు భూములు పచ్చగా**
**జగదేపూర్ నుంచి నల్గొండ వరకు సాగునీటి విస్తరణ**
**హల్దీ వాగు జీవనదిగా మారి లక్షల ఎకరాలకు సాగునీరు**
**రైతు బంధు, బీమాతో ఆర్థిక బలోపేతం**
**కాంగ్రెస్ హామీలు అమలు కాలేదని వంటేరు విమర్శ**

**వాస్తవం : గజ్వేల్ ఆర్ సి**

రాష్ట్రంలో రైతుల జీవనాధారంగా కాళేశ్వరం ప్రాజెక్టు నిలిచిందని గజ్వేల్ నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ వంటేరు ప్రతాప్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ... మండుటెండల్లోనూ గోదావరి జలాలను ఎత్తిపోసి పొలాలకు అందించిన ఘనత మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ దే అన్నారు. కొండపోచమ్మ సాగర్ ద్వారా హల్దీ వాగు, సంగారెడ్డి, రామాయంపేట కాల్వలతో పాటు పలు ఉపకాల్వల ద్వారా దాదాపు 50 కి పైగా గ్రామాల్లో చెక్‌డ్యామ్‌లు, చెరువులు నిండిపోయాయని తెలిపారు. హల్దీ వాగు జీవనదిగా మారి బీడు భూములు పచ్చని పంటచేలుగా రూపాంతరం చెందాయని చెప్పారు. నిజాంసాగర్ వరకు నదికి ఇరువైపులా లక్షల ఎకరాల్లో వరి సాగు జరుగుతోందని వివ రించారు. అలాగే జగదేపూర్, ఆలేరు, భువనగిరి, నల్గొండ జిల్లాలకు ఎండాకాలంలో సైతం కొండపోచమ్మ సాగర్ నుంచి సాగునీరు అందించిన ఘనత పూర్తిగా కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. ఒకప్పుడు నీటి కోసం ఎదురుచూసిన రైతులు, ఇప్పుడు ఎండాకాలంలోనూ పంటలు సాగు చేస్తున్న పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. మల్లన్న సాగర్ కాల్వ ద్వారా కూడవెల్లి వాగులోకి నీరు విడుదల చేయడంతో గజ్వేల్, దుబ్బాక ప్రాంతాలతో పాటు మానేరు, సిరిసిల్ల వరకూ సాగు విస్తరించిందన్నారు. భూగర్భ జలాల మట్టం పెరిగి బావులు, బోర్లలో నీటి లభ్యత మెరుగుపడిందని, గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్యలు కూడా తగ్గాయని తెలిపారు.కెసిఆర్ ప్రభుత్వ హయాంలో రైతు బంధు, రైతు బీమా, నాణ్యమైన విత్తనాలు, ఎరువుల సరఫరా, 24 గంటల విద్యుత్‌తో రైతులు ఆర్థికంగా బలపడినట్లు పేర్కొన్నారు. వ్యవసాయానికి అనుబంధ రంగాలు కూడా అభివృద్ధి దిశగా పయనించాయని చెప్పారు.ప్రస్తుతం అధికారంలో ఉన్న



కాంగ్రెస్ ప్రభుత్వం కొత్త ప్రాజెక్టులు చేపట్టలేదని, కాల్వల నిర్మాణంలో పురోగతి లేదని విమర్శించారు. రైతులకు సకాలంలో సాగునీరు, విద్యుత్, ఎరువులు అందడం లేదని, ఎన్నికల హామీలు అమలు కావడం లేదని ఆరోపించారు. రైతాంగ సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

## శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవస్థానం

# మహాశివరాత్రి హుండీ లెక్కింపు

**దేవస్థానం చైర్మన్ బైసా సుధాకర్ యాదవ్**
**ఈవో శశిధర్ గుప్తా**

**వాస్తవం : సంగారెడ్డి జిల్లా ప్రతినిధి**

పటాన్చెరు నియోజకవర్గం అమీన్పూర్ జిహెచ్ఎంసి పరిధిలో ఉన్న బీరంగూడ గుట్టపై శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు.అనంతరం మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా విజయవంతంగా ముగిశాయి.ఈ సందర్భంగా ఆలయంలో హుండీ లెక్కింపు కార్యక్రమాన్ని దేవస్థానం చైర్మన్ బైసా సుధాకర్ యాదవ్,ఈవో శశిధర్ గుప్తా ఆధ్వర్యంలో దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ రంగారావు సమక్షంలో నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా చైర్మన్ బైసా సుధాకర్ యాదవ్ మాట్లాడుతూమహాశివరాత్రి సందర్భంగా భక్తులు సమర్పించిన హుండీ ఆదాయం 8,62,677లు రావడం ఆనందదాయకం. దర్శనం టికెట్లు, టెండర్లు, అన్నదానానికి భక్తులు అందించిన విరాళాలు కలిపి మొత్తం 80,92,132 లు సమకూరడం స్వామి అమ్మవార్లపై భక్తుల అచంచల విశ్వాసానికి నిదర్శనం.ఈ మహోత్సవాలను ఇంత ఘనంగా నిర్వహించడంలో సహకరించిన ప్రతి ఒక్కరికీ ఆలయ కమిటీ తరపున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే జాతర సందర్భంగా భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసి కార్యక్రమం విజయవంతం చేసిన సీపీ, డీసీపీలు, ఏసీపీలు, సీఐలు, పోలీస్ సిబ్బందికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.బ్రహ్మోత్సవాల సమయంలో నిరంతర విద్యుత్ సరఫరా అందించిన విద్యుత్ శాఖ ఏడీలు, ఏఈలు, సిబ్బందికి తాగునీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సేవలందించిన అధికారులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.అలాగే దేవాలయ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు కృషి చేసిన డిప్యూటీ కమిషనర్,మున్సిపల్ సిబ్బందికి హృదయపూర్వక ధన్యవాదాలు. అలాగే జాతర నిర్వహణలో సమన్వయంతో సహకరించిన అమీన్ పూర్ ఎమ్మార్వోకి,అన్ని శాఖల అధికారులకు నా ప్రత్యేక కృతజ్ఞతలు.దాతలువాలంటీర్లు, మీడియా మిత్రులు, భక్తులందరికీ పేరుపేరునా ధన్యవాదాలు తె





లియజేస్తూ భవిష్యత్తులో ఆలయ అభివృద్ధి కోసం మరిన్ని ధార్మిక, సేవా కార్యక్రమాలు చేపడతామని తెలియజేస్తున్నాను.

# పదవీ విరమణ పొందే ప్రధానోపాధ్యాయునికి ఘన సన్మానం

**వాస్తవం : చందుర్తి**

పదవి విరమణ పొందుతున్న ప్రధానోపాధ్యాయులు గుర్రం కృష్ణారెడ్డి ని శుక్రవారం ఘనంగా సన్మానించారు. చందుర్తి మండలంలోని సనుగుల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రాథమిక స్థాయి కాంప్లెక్స్ సమావేశం నిర్వహించారు.ఇందులో భాగంగా మండలంలోని ఎన్గల్ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తున్న గుర్రం కృష్ణారెడ్డి ఈ నెలలో పదవి విరమణ పొందుతున్న సందర్భంగా కాంప్లెక్స్ సమావేశంలో మండల విద్యాధికారి, ఉపాధ్యాయులు సంయుక్తంగా సన్మానించారు.ఈ సందర్భంగా మండల విద్యాధికారి ఒరుగంటి వినయ కుమార్ మాట్లాడుతూ..సుదీర్ఘ కాలం ఉపాధ్యాయులుగా పనిచేసి విద్యాబోధనలో విశిష్ట



సేవలు అందించి ఎంతో మంది విద్యార్థుల జీవితాలు తీర్చిదిద్ది ఆదర్శ ఉపాధ్యాయులుగా, జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా జిల్లా స్థాయిలో సన్మానం పొందారని అన్నారు.ఇలాంటి ఉపాధ్యాయులు ఉపాధ్యాయ లోకానికి ఆదర్శనీయమని అన్నారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు గుర్రం మల్లారెడ్డి, వంగ తిరుపతి తాటికొండ సంజీవ్ ,ఎడ్ల కిషన్ కటుకూరి ముఖేష్, పుప్పాల శ్రీనివాసచారి,అనిల్ రావు, శ్రీనివాస్, గంగాధర రమేష్, వేముల సుజాత ఎలగేటి శ్రీలత, శ్యామల, శ్రీలత ,నాగమణి పాల్గొన్నారు.

# ఇతరుల చెక్కులు అక్రమంగా ఖాతాల్లో జమ చేస్తే కఠిన చర్యలు

### మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి

శంకరపట్నం : వాస్తవం

ఇతరుల పేరిట మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎవరైనా అక్రమంగా తమ బ్యాంకు ఖాతాల్లో జమ చేసి డబ్బులు డ్రా చేసుకునే వారికి చట్టపరమైన చర్యలు తప్పవని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ స్పష్టం చేశారు. శుక్రవారం శంకరపట్నం మండల కేంద్రంలోని రైతు వేదికలో మండలానికి చెందిన 44 మంది లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఆయన పంపిణీ చేశారు.ఈ సందర్భంగా డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ ప్రైవేటు ఆస్పత్రుల్లో వైద్య సేవలు,చికిత్సలు పొందిన పేదలకు ఆర్థికంగా కొంత మేరకు చేయూతనందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ముఖ్యమంత్రి సహాయ నిధి ఆర్థిక సహాయాలు అందజేస్తున్నదన్నారు.అయితే కొందరు ఈ చెక్కులను కాజేసే ప్రయత్నం చేయడం దారుణమని ఆయన పేర్కొన్నారు. ఇతరులకు మంజూరైన చెక్కులను బ్యాంకు ఖాతాల్లో జమ చేసుకోవడం అక్రమమని, ఇలాంటి అక్రమాలకు పాల్పడే వ్యక్తులను కఠినంగా శిక్షించాల్సిందేనని ఆయన స్పష్టం చేశారు. తన దృష్టికి వచ్చిన ఘటనలపై పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేయడం జరుగుతుందని ఆయన వివరించారు. బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన చెప్పారు. ఇప్పుడు వస్తున్న సీఎంఆర్ఎఫ్ చెక్కులపై లబ్ధిదారుని ఇంటి పేరుతో సహా పూర్తి పేరు, అతని బ్యాంక్ ఖాతా నెంబర్ ఉంటున్నదని, ఒక వేళ చెక్కు దారి మళ్లినా ఇతరులు ఆ చెక్కులను ఖాతాల్లో జమ చేసుకునే అవకాశం ఉండదని, ఇక నుంచి లబ్ధిదారులు ఎలాంటి ఆందోళనకు గురికావల్సిన అవసరం లేదని ఆయన పేర్కొన్నారు. శంకరపట్నం మండలానికి 23వ విడుత కింద 44 మందికి 14.22 లక్షల రూపాయలు మంజూరు కాగా చెక్కులు లబ్ధిదారులకు ఎమ్మెల్యే అందజేశారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కృష్ణ ప్రసాద్,తహసీల్దార్ సురేఖ,మాజీ జెడ్పిటిసి బత్తిని శ్రీనివాస్ గౌడ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గోపగోని బసవయ్య గౌడ్ కొత్తగట్టు మత్స్య గిరింద్ర స్వామి ఆలయ చైర్మన్ కోరెం రాజిరెడ్డి,తదితరులు పాల్గొన్నారు.



# ఇంటర్మీడియట్ పరీక్షల పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు

వాస్తవం: సిరిసిల్ల

ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల నిర్వహణ నేపథ్యంలో సిరిసిల్ల సబ్ డివిజన్ పరిధిలో ఏర్పాటు చేసిన 10 పరీక్షా కేంద్రాల వద్ద తేది 25-02-2026 నుండి 18-03-2026 వరకు ప్రతిరోజు ఉదయం 09:00 గంటల నుండి మధ్యాహ్నం 12:00గంటల వరకు144 సెక్షన్ అమల్లో ఉంటుందని సిరిసిల్ల డిఎస్పీ నాగేంద్రచారి తెలిపారు.జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు పరీక్షలు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు జరిగేలా భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయడం జరుగుతుందని పేర్కొన్నారు.ఇద్దరు లేదా అంతకంటే ఎక్కువ మంది వ్యక్తులు పరీక్షా కేంద్రాల వద్ద గుమికూడరాదని,నిషేధిత వస్తువులతో పరీక్షా కేంద్రాల వద్ద సంచరించరాదని, పరీక్షా కేంద్రం నుండి 200 మీటర్ల పరిధిలో ఉన్న జిరాక్స్ సెంటర్లు ఉదయం 08:00 గంటల నుండి మధ్యాహ్నం 01:00 గంటల వరకు మూసివేయాలని,పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు, తల్లిదండ్రులు మరియు ప్రజలు పోలీస్ శాఖకు సహకరించి నిబంధనలు పాటించాలని విజ్ఞప్తి చేశారు.



### ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టాలి

### సబితా ఇంద్రారెడ్డి



వాస్తవం : రాజేంద్రనగర్

రాష్ట్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడుతూ నూతన నాయకులు ప్రజలకు మరింత చేరువ కావాలని మాజీ మంత్రి ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం రాజేంద్రనగర్ మైలార్దేవ్పల్లి బిఆర్ఎస్ అధ్యక్షునిగా గుమ్మడి కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆయనకు సబితా ఇంద్రారెడ్డి,నియోజకవర్గ ఇన్చార్జ్ కార్తీక్ రెడ్డి నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..కాంగ్రెస్ ప్రభుత్వ పాలన పేదల పాలిట శాపంగా మారిందని అన్నారు. నూతనంగా డివిజన్ల అధ్యక్షులుగా బాధ్యతలు చేపట్టిన నాయకులు ప్రజాక్షేత్రంలో బిఆర్ఎస్ చేసిన అభివృద్ధిని వివరిస్తూ నూతన ఉత్సాహంతో ముందుకు వెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# రైతులకు యూరియా బుకింగ్ ఆప్ పై అవగాహన

మందమర్రి : వాస్తవం

మండలంలోని రైతులకు రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన యురియా బుకింగ్ యాప్ పై వ్యవసాయ అధికారులు అవగాహన కల్పించారు. మండలంలోని ఆదిల్ పేట గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమం లో మండల వ్యవసాయ విస్తరణ అధికారి ముత్యం తిరుపతి రైతులకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత సీజన్‌లో యూరియా అందుబాటులో లేక జరిగిన ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ శాఖ ద్వారా యూరియా బుకింగ్ యాప్ ని ప్రవేశపెట్టి రైతులకు సులభ తరంగా యూరియా పొందుటకు మార్గం సుగమం చేసిందన్నారు. ఆప్ ని గూగుల్ ప్లే స్టోర్ నుండి డౌన్లోడ్ చేసుకుని, యాప్ నందు రైతు పట్టాదారు పాసుపుస్తకంతో లింకు ఉన్న మొబైల్ నెంబర్ ద్వారా లాగిన్ అయ్యి తనకు అందుబాటులో ఉన్న డీలర్ వద్ద నుండి సాగు ఎకరాలను, పంటను బట్టి రెండు మూడు దఫాలుగా యూరియాను పొందవచ్చని, గ్రామ పరిధిలోని వివిధ డీలర్ల వద్ద అందుబాటులో ఉన్న యూరియా బస్తాల వివరాలను తెలుసుకోవచ్చని, అంతే కాకుండా జిల్లా పరిధిలో ఎక్కడి నుండైనా ఈ యాప్ ద్వారా యూరియా పొంద వచ్చని సూచించారు. ప్రతి రైతు కేవలం యూరియా బుకింగ్ యాప్ ఉపయోగించి ప్రస్తుత పంట కాలానికి యూరియాను పొందాల న్నారు. ఈ కార్యక్రమంలో ఫెర్టిలైజర్ డీలర్, ఆదిల్ పేట, సారంగపల్లి గ్రామాల రైతులు పాల్గొన్నారు.





### రోడ్డు నిర్మాణాల పేరిట

# భారీ బ్లాస్టింగ్లు

### బ్లాస్టింగలతో భయం భయంగా జీవిస్తున్న గ్రామస్తులు



వాస్తవం : మనోహరాబాద్

మండలంలోని ఘనపూర్ గ్రామ పరిధిలో పరిశ్రమల కోసం నిర్వహిస్తున్న భారీ బ్లాస్టింగ్‌లపై ధర్మరాజు పల్లి గ్రామస్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.పేలుడు శబ్దాలకు నివాస గృహాలు అదురుతూ భూకంపం వస్తుందేమో అన్న పరిస్థితిలో ప్రజలు భయం భయంగా జీవిస్తున్నారు.రోడ్ల,నూతన నిర్మాణాల పేరిట కాంట్రాక్టర్లు చేస్తున్న బ్లాస్టింగ్ల వల్ల ధర్మరాజు పల్లి గ్రామంలో నివాస గృహాలు ధ్వంసమవుతున్నాయని,బోరు బావులు పూడిపోతున్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు,అధికారులు వెంటనే స్పందించి తక్షణ చర్యలు తీసుకోని తమ ప్రాణాలను,ఆస్తులను,కాపాడాలని ప్రజలు కోరారు.

జన్మదినోత్సవాలు, పదవీ విరమణ శుభాకాంక్షల
ప్రకటనల కోసం సంప్రదించండి
8074124190
వాస్తవం



# పంచాయతీలకు గుడ్ న్యూస్

# రూ.387.53 కోట్లు విడుదల

**మూడోవిడతగా 15వ ఆర్థిక సంఘం నుంచి విడుదల**

**ఇంకా కేంద్రం వద్ద పెండింగ్‌లోనే కూ.2000 కోట్లు**

**పెండింగ్ నిధులను త్వరగా విడుదల చేయాలి:మంత్రి సీతక్క**




**రాష్ట్రంలోని గ్రామ పంచాయతీల అభివృద్ధికి సంబంధించి 15వ ఆర్థిక సంఘం నిధులను కేంద్ర ప్రభుత్వం విడుదల చేస్తున్నది. రాష్ట్రంలో ఇటీవల పంచాయతీ ఎన్నికల ప్రక్రియ ముగియడంతో పెండింగ్‌లోని నిధులను విడతలవారీగా మంజూరు చేస్తున్నది. ఈ క్రమంలోనే శుక్రవారం మూడో విడతకుగాను రూ.387.53 కోట్లను విడుదల చేసింది.**



**ఇంకా సుమారు రూ.2,000 కోట్ల మేర విడుదల చేయా ల్సిన నిధులు పెండింగ్‌లో ఉన్నాయని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి సీతక్క ఒక ప్రకటనలో తెలిపారు. పెండింగ్ నిధులను తక్షణమే విడుదల చేయాలని కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తిచేశారు.**



హైదరాబాద్, ఫిబ్రవరి 20 :

రాష్ట్రంలోని గ్రామ పంచాయతీల అభివృద్ధికి సంబంధించి 15వ ఆర్థిక సంఘం నిధులను కేంద్ర ప్రభుత్వం విడుదల చేస్తున్నది. రాష్ట్రంలో ఇటీవల పంచాయతీ ఎన్నికల ప్రక్రియ ముగియడంతో పెండింగ్‌లోని నిధులను విడతలవారీగా మంజూరు చేస్తున్నది. ఈ క్రమంలోనే శుక్రవారం మూడో విడతకుగాను రూ. 387.53 కోట్లను విడుదల చేసింది. దీంతో ఇప్పటివరకు రాష్ట్రానికి మొత్తం రూ. 1,034. 42 కోట్ల మేర నిధులు అందాయి. గ్రామీణాభివృద్ధి కార్యక్రమాలు వేగవంతంగా కొనసాగేందుకు ఈ నిధులు కీలకంగా ఉపయోగపడనున్నాయి.ముఖ్యంగా గ్రామాల్లో మౌలిక వసతుల అభివృద్ధి, పారిశుధ్య నిర్వహణ, మంచినీటి సరఫరా, వీధి దీపాల ఏర్పాటు, అంతర్గత రహదారుల మరమ్మతులు వంటి పనులకు ఈ నిధులను వినియోగిస్తారు. అయితే, ఇంకా సుమారు రూ. 2,000 కోట్ల మేర విడుదల చేయాల్సిన నిధులు పెండింగ్‌లో ఉన్నాయని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశా ఖ మంత్రి సీతక్క ఒక ప్రకటనలో తెలిపారు. పెండింగ్ నిధులను తక్షణమే విడుదల చేయాలని కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తిచేశారు. గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి కొనసాగాలంటే నిధుల విడుదల అవసరమని ఆమె స్పష్టంచేశారు.

## ఇప్పటివరకు విడుదలైన నిధులు

- తొలివిడత రూ.323.45 కోట్లు
- రెండో విడత రూ.323.44 కోట్లు
- మూడోవిడత రూ.387.53 కోట్లు
- మొత్తం వచ్చినవి రూ.1,034.42 కోట్లు
- ఇంకా పెండింగ్‌లోసుమారు 2,000 కోట్లు

## సీ. సీ. రోడ్డుకు శంకుస్థాపన చేసిన సర్పంచ్ వడ్డే సైదిరెడ్డి



**వాస్తవం : మాడుగులపల్లి :** మండల పరిధిలోని చెరువుపల్లి గ్రామపంచాయతీలో మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథకం కింద మంజూరైన ఐదు లక్షల రూపాయలతో వైకుంఠధామం వరకు సీ. సీ. రోడ్డుకు శుక్రవారం గ్రామ సర్పంచ్ వడ్డే సైదిరెడ్డి శంకుస్థాపన చేశారు ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ మానపాటి వినోద్,గ్రామ కార్యదర్శి సతీష్ రెడ్డి, వార్డ్ మెంబర్లు ఇటిక్యాల నాగిరెడ్డి, ఉప్పు నాగరాజు,గ్రామ పెద్దలు చెరుకుపల్లి రాజు, చిలకరాజు పరశురాములు, బొ్రరాజు సైదులు, కోటిరెడ్డి, ప్రభాకర్ రెడ్డి, రాంమ్మూర్తి, లచ్చయ్య, శేఖర్, రామకృష్ణ, వెంకన్న, నాగరాజు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.




# సంస్కరణల ముసుగులో

# గ్రామీణ వ్యవస్థల విధ్వంసం


**పాలకుల 'తుగ్లక్' ప్రయోగాలకు**

**బలిపశువులవుతున్న సామాన్యులు**

**క్షేత్రస్థాయిలో ఉన్న పటిష్టమైన వ్యవస్థలను**

**బలోపేతం చేయాల్సింది పోయి**

**ఉన్న పునాదులను సైతం పెకిలించివేస్తున్న వైనం**



**తెలంగాణ గడ్డపై గ్రామ స్వరాజ్యం విరాజిల్లుతుందని, పాలన ప్రజల ముంగిటకే వస్తుందని ఆశించిన కోట్లాది మంది ప్రజలకు నేడు పాల కుల అసంబద్ధ విధానాలు శాపంగా మారాయి. నిజాం కాలం నాటి పటేల్-పట్వారీ వ్యవస్థ నుండి నేటి 'గ్రామ పాలనా అధికారుల' వరకు జరిగిన ప్రయాణం అభివృద్ధి వైపు కాక, అస్తవ్యస్తమైన అగాధంలోకి సాగిందనడంలో ఎటువంటి సందేహం లేదు. సంస్కర ణల పేరుతో గత దశాబ్ద కాలంగా సాగుతున్న పరిపాలనా ప్రయోగాలు క్షేత్రస్థాయిలో ఉన్న పటిష్టమైన వ్యవస్థలను బలోపేతం చేయాల్సింది పోయి, ఉన్న పునాదులను సైతం పెకిలించివేశాయి. ఒక వ్యవస్థను రద్దు చేసేముందు దానికంటే మెరుగైన ప్రత్యామ్నాయాన్ని సిద్ధం చేయడంలో పాలక వర్గాల మేధో వైఫల్యం నేడు సామాన్య పౌరుడి పాలిట యమపాశమై కూర్చుంది.**

తెలంగాణ గడ్డపై గ్రామ స్వరాజ్యం విరాజిల్లుతుందని, పాలన ప్రజల ముంగిటకే వస్తుందని ఆశించిన కోట్లాది మంది ప్రజలకు నేడు పాలకుల అసంబద్ధ విధానాలు శాపంగా మారాయి. నిజాం కాలం నాటి పటేల్-పట్వారీ వ్యవస్థ నుండి నేటి 'గ్రామ పాలనా అధికారుల' వరకు జరిగిన ప్రయాణం అభివృద్ధి వైపు కాక, అస్తవ్యస్తమైన అగాధంలోకి సాగిందనడంలో ఎటువంటి సందేహం లేదు. సంస్కరణల పేరుతో గత దశాబ్ద కాలంగా సాగుతున్న పరిపాలనా ప్రయోగాలు క్షేత్రస్థాయిలో ఉన్న పటిష్టమైన వ్యవస్థలను బలోపేతం చేయాల్సింది పోయి, ఉన్న పునాదులను సైతం పెకిలించివేశాయి. ఒక వ్యవస్థను రద్దు చేసేముందు దానికంటే మెరుగైన ప్రత్యామ్నాయాన్ని సిద్ధం చేయడంలో పాలక వర్గాల మేధో వైఫల్యం నేడు సామాన్య పౌరుడి పాలిట యమపాశమై కూర్చుంది.

### వ్యవస్థల విధ్వంసం మరియు అధికారిక అరాచకం

ఒకప్పుడు అమల్లో ఉన్న రెవెన్యూ వ్యవస్థలో ఎన్ని లోపాలు ఉన్నప్పటికీ, గ్రామ స్థాయి అధికారులకు భూముల సరిహద్దులపై, వంశ వృక్షాలపై, స్థానిక సామాజిక భౌగోళిక పరిస్థితులపై పూర్తి అవగాహన ఉండేది. అయితే, గత ప్రభుత్వ హయాంలో ఎటువంటి ముందస్తు ప్రణాళిక లేకుండా, కేవలం రాజకీయ అహంకారంతో వీఆర్వో వ్యవస్థను రద్దు చేయడం గ్రామీణ పాలనలో కోలుకోలేని దెబ్బ తీసింది. వేల సంఖ్యలో ఉన్న అనుభవజ్ఞులైన సిబ్బందిని చెల్లాచెదురు చేసి, గ్రామాలను అనాథలుగా మార్చారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న రేవంత్ రెడ్డి ప్రభుత్వం కూడా అదే బాటలో పయనిస్తూ, కొత్త పేర్లతో పాత రోతనే వడ్డిస్తోంది. 'జీపీఓ'ల పేరుతో ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన వ్యవస్థ క్షేత్రస్థాయిలో పూర్తి విఫలమైంది. ?కొత్తగా బాధ్యతలు చేపట్టిన అధికారులకు రెవెన్యూ చట్టాలపై కనీస అవగాహన లేదు, పోనీ వారికి సరైన శిక్షణ ఇచ్చారా అంటే అదీ లేదు. ఫలితంగా, భూ రికార్డుల నిర్వహణ అస్తవ్యస్తంగా మారి, చిన్నపాటి భూమి సవరణ కోసం కూడా రైతులు తహసీల్దార్ కార్యాలయాల ముందు చెప్పులు అరిగేలా తిరగాల్సిన దుస్థితి ఏర్పడింది. పాత రికార్డులకు, కొత్త ఆన్‌లైన్ ఎంట్రీలకు మధ్య పొంతన లేకపోవడంతో వేల సంఖ్యలో వివాదాలు పుట్టుకొస్తున్నాయి. ఇది కేవలం పరిపాలనా లోపం మాత్రమే కాదు, గ్రామీణ ఆర్థిక వ్యవస్థను కుప్పకూల్చే కుట్రగా కనిపిస్తోంది.

### డిజిటల్ మాయాజాలం - అవినీతికి కొత్త చిరునామా

పాలనలో పారదర్శకత తీసుకువస్తామంటూ పాలకులు ఊదరగొడుతున్న 'డిజిటల్ విప్లవం' గ్రామీణ భారతాన్ని వంచిస్తోంది. కనీసం నిరంతర విద్యుత్ సౌకర్యం, వేగవంతమైన ఇంటర్నెట్ లేని కుగ్రామాల్లో ఆన్‌లైన్ సేవలను తప్పనిసరి చేయడం పాలకుల అజ్ఞానానికి పరాకాష్ట. 'ధరణి' పోర్టల్ తెచ్చిన తలనొప్పులు ఇంకా తగ్గకముందే, మరిన్ని కొత్త నిబంధనలు తీసుకురావడం సామాన్యుడికి సాంకేతిక నరకాన్ని పరిచయం చేస్తోంది. సర్వర్ల మొరాయింపు, డేటా గందరగోళం వంటి సాకులతో అధికారులు పనులను వాయిదా వేస్తుండటంతో, లంచగొండితనానికి కొత్త రెక్కలు వచ్చాయి.ఒకప్పుడు నేరుగా కంటికి కనిపించే అవినీతి, ఇప్పుడు 'సాంకేతిక లోపం' అనే ముసుగులో మధ్యవర్తుల ద్వారా యథేచ్ఛగా సాగుతోంది. డిజిటల్ రికార్డుల్లో దొర్లుతున్న తప్పులను సవరించుకోవడానికి పౌరులు తమ ఆస్తులను అమ్ముకుని కోర్టుల చుట్టూ, జిల్లా కలెక్టరేట్ల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి రావడం ప్రజాస్వామ్యానికే అవమానం. కంప్యూటర్ స్క్రీన్ మీద ఒక్క క్లిక్‌తో మాయమవుతున్న భూమి హక్కులను కాపాడుకోవడానికి సామాన్య రైతు అష్టకష్టాలు పడుతున్నాడు. సాంకేతికత అనేది సౌలభ్యం కోసం ఉండాలి కానీ, అది సామాన్యుడిని బలితీసుకునే ఆయుధంగా మారకూడదు.

### బాధ్యతారాహిత్యం.. బలిపశువులవుతున్న పౌరులు

ప్రభుత్వాలు మారినప్పుడల్లా పేర్లు మార్చడం, కొత్త హోదాలు సృష్టించడం వల్ల పాలన మెరుగుపడదు. ఒకే అధికారిపై సంక్షేమ పథకాల అమలు, భూ రికార్డుల పర్యవేక్షణ, పంచాయతీ పాలన వంటి సవాలక్ష బాధ్యతలు రుద్దడం వల్ల ఏ ఒక్క పని కూడా నాణ్యంగా జరగడం లేదు. గ్రామ సభల ప్రాధాన్యతను పూర్తిగా తుంగలో తొక్కి, పైస్థాయి నుంచి వచ్చే ఆదేశాలను అమలు చేసే రోబోలుగా అధికారులను మార్చడం వల్ల ప్రజాస్వామ్య స్ఫూర్తి క్రమంగా కనుమరుగవుతోంది. స్థానిక అవసరాలను గుర్తించకుండా, కేవలం రాజకీయ లబ్ధి కోసం, బడ్జెట్ అంకెల గారడీ కోసం చేసే ఇటువంటి సంస్కరణలు గ్రామీణ ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేస్తున్నాయి. మౌలిక సదుపాయాలు కల్పించకుండా, సిబ్బంది సామర్థ్యాన్ని పెంచకుండా వ్యవస్థలను మార్చుకుంటూ పోతే భవిష్యత్తులో గ్రామాల్లో తీవ్రమైన సామాజిక అశాంతి నెలకొనే ప్రమాదం ఉంది. గ్రామాల్లోని సహజ వనరులు, భూమి హక్కులు, సామాజిక సంబంధాలను ఈ 'తుగ్లక్' సంస్కరణలు ఛిన్నాభిన్నం చేస్తున్నాయి.

### మేలుకోకపోతే మునిగిపోవడం ఖాయం

పాలకుల ప్రయోగశాలలుగా గ్రామాలు మారిపోవడం అత్యంత విచారకరం. ప్రయోగాలు విఫలమైనప్పుడల్లా నష్టపోయేది సామాన్య రైతే అన్న కనీస స్పృహ ప్రభుత్వాలకు లేకపోవడం గమనార్హం. కేవలం కాగితాల మీద, కంప్యూటర్ స్క్రీన్ల మీద కనిపించే 'అంతా బాగుంది' అనే అబద్ధపు రిపోర్టులను చూసి సంబరపడటం ఆపి, పాలకులు క్షేత్రస్థాయి వాస్తవాలను చూడాలి. జీపీఓలకు కఠినమైన శిక్షణ ఇవ్వడం, భూ వివాదాల పరిష్కారానికి ప్రత్యేక యంత్రాంగాన్ని ఏర్పాటు చేయడం, మరియు అన్నింటికంటే ముఖ్యంగా సాంకేతికతను సామాన్యుడికి భారంగా కాకుండా భరోసాగా మార్చడం తక్షణ అవసరం.లేనిపక్షంలో, ఈ అసంబద్ధ సంస్కరణలు ప్రజల ఆగ్రహ జ్వాలల్లో భస్మమవ్వడం ఖాయం. గ్రామాల్లో పాలన పడకేసిన ఈ తరుణంలో, ప్రభుత్వం తక్షణమే స్పందించి వ్యవస్థలను గాడిలో పెట్టకపోతే 'గ్రామ స్వరాజ్యం' అనేది కేవలం పాఠ్య పుస్తకాలకే పరిమితమవుతుంది. పాలకుల మేధో వైఫల్యానికి సామాన్య జనం మూల్యం చెల్లించలేరు. ఇప్పటికైనా పాలకుల తీరు మారాలి, లేదంటే గ్రామీణ తెలంగాణలో పెల్లుబికే ప్రజా వేడికి ప్రభుత్వాలు సమాధానం చెప్పుకోక తప్పదు.

**వెంక గారి భూమయ్య,**
**సీనియర్ జర్నలిస్ట్ విశ్లేషణ**
**ఫోన్: 9848559863**



# డిజిటల్ గవర్నెన్స్‌లో

# తెలంగాణ రోల్ మోడల్

**ఏఐ, క్వాంటం కంప్యూటింగ్‌తో విప్లవాత్మక మార్పులు**

**సామాన్యుడి చెంతకు అత్యాధునిక సాంకేతికత**

**ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ 2026లో మంత్రి దుద్దిళ్ల**

**న్యూఢిల్లీ :** కొత్త పుంతలు తొక్కుతున్న డిజిటల్ గవర్నెన్స్‌లో దేశానికే తెలంగాణను రోల్ మోడల్‌గా తీర్చిదిద్దుతున్నట్లు ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. కృత్రిమ మేధ (ఏఐ), క్వాంటం కంప్యూటరింగ్‌తో విప్లవాత్మక మార్పులొస్తాయని, తద్వారా సామాన్యుడికి చెంతకు అత్యాధునిక సాంకేతికత చేరుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. 'తెలంగాణ రైజింగ్ - 2047'లో టెక్నాలజీయే కీలకమని న్యూఢిల్లీలో జరుగుతున్న 'ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ - 2026'లో భాగంగా శుక్రవారం ప్రత్యేక చర్చా కార్యక్రమంలో ఆయన చెప్పారు. ఏఐ, క్వాంటం కంప్యూటింగ్, బ్లాక్ చెయిన్ వంటి 'కటింగ్ ఎడ్జ్' సాంకేతికతలను సాఫ్ట్‌వేర్లుగా మాత్రమే కాక సామాన్యుడి జీవితాల్లో మార్పు తెచ్చే ' పరివర్తన సాధనాలు (ట్రాన్స్‌ఫార్మేషన్ టూల్స్)'గా మారుస్తున్నామన్నారు. 'సాంకేతిక ఫలాలు కేవలం ఒక వర్గానికి, ప్రాంతానికి పరిమితం కాకూడదు. అందుకే 'ఏజెంటిక్ ఏఐ' ద్వారా ప్రతి ఒక్కరికీ సేవలు అందేలా చూస్తున్నాం. ఫ్యూచర్ సిటీ, ఏఐ సిటీ, ఏఐ యూనివర్సిటీ, ఐకం (ఏఐకేపీఎం), భూ భారతి వంటి సంస్కరణలు డిజిటల్ రంగంలో తెలంగాణ బ్రాండ్‌ను విశ్వవ్యాప్తం చేస్తున్నాయి' అని మంత్రి దుద్దిళ్ల తెలిపారు. కేవలం ఐటీకే పరిమితం కాకుండా.. వ్యవసాయం, ఆరోగ్యం, క్లీన్ ఎనర్జీ, విపత్తు నిర్వహణ రంగాల్లోనూ ఏఐని విస్తృతంగా వినియోగిస్తున్నట్లు తెలిపారు.

**పెట్టుబడులకు స్వర్గధామం..**

ప్రతి పల్లెకు సాంకేతికతను చేరవేయడానికి 'టీ-ఫైబర్' ద్వారా బృహత్తర యజ్ఞం కొనసాగుతోందని




మంత్రి దుద్దిళ్ల చెప్పారు. ప్రభుత్వ సేవలు అవినీతికి తావులేకుండా నేరుగా ప్రజలకు అందేలా టీ-ఫైబర్ కీలక పాత్ర పోషిస్తుందన్నారు. స్వీడన్ వాణిజ్య ప్రతినిధులతో జరిగిన భేటీలో ఆయన మాట్లాడుతూ.. నిరంతర విద్యుత్ సరఫరా, స్థిరమైన పారిశ్రామిక విధానాలతో తెలంగాణ పెట్టుబడులకు స్వర్గధామంగా మారిందని, నూతన ఆవిష్కరణలతో వచ్చే గ్లోబల్ టెక్ కంపెనీలకు ఎల్లప్పుడూ తెలంగాణ స్వాగతం పలుకుతుందని స్పష్టం చేశారు. ఏఐ వల్ల ఉద్యోగ విధుల్లో మార్పులు రావడం సహజమన్న దుద్దిళ్ల.. ఆ సవాళ్లను అవకాశాలుగా మార్చుకునేందుకు సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని సర్కారు ముందుచూపుతో అడుగులు వేస్తోందని తెలిపారు. తెలంగాణ అపారమైన ప్రతిభావంతులకు నిలయమని చెప్పారు. గత రెండేళ్లుగా 'స్కిల్లింగ్, రీ-స్కిల్లింగ్' లపై ప్రత్యేక శ్రద్ధ పెట్టామన్నారు. ఏఐ పరిశోధనలతో కొత్త ఉద్యోగాలు పుట్టుకొస్తాయని, యువత వాటిని అందుపుచ్చుకోవడానికి సిద్ధంగా ఉండాలని దుద్దిళ్ల పిలుపునిచ్చారు.

---

**నూతన గ్రామపంచాయతీ భవనాలను**

## ప్రారంభించిన ఎమ్మెల్యే కవ్వంపల్లి



**శంకరపట్నం : వాస్తవం :**

శంకరపట్నం మండలంలోని చింతలపల్లె, ముత్తారం గ్రామాల్లో నూతన గ్రామపంచాయతీ భవనాలను శుక్రవారం మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ప్రారంభించారు. అలాగే లింగాపూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సురేఖ, ఎంపీడీవో కృష్ణ ప్రసాద్, ఏఈ మల్లేశం, ఎంపీఓ ప్రభాకర్, మాజీ జడ్పిటిసి బత్తిని శ్రీనివాస్ గౌడ్, సర్పంచులు రాజేంద్రప్రసాద్, మారవేణి రాజయ్య, చింతల లావణ్య శ్రీనివాస్,చింతిరెడ్డి పద్మ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గోపగోని బసవయ్య గౌడ్, మార్కెట్ వైస్ చైర్మన్ నాంపల్లి తిరుపతి, మత్స్యగిరి స్వామి ఆలయ చైర్మన్ కోరం రాజిరెడ్డి, కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి గట్టు తిరుపతి గౌడ్, మాజీ సర్పంచులు పల్లె పాపిరెడ్డి, పల్లె సంజీవరెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకుడు ఊకంటి మధుకర్, మాజీ సర్పంచి శేషాచారి, ఉప సర్పంచ్ గట్టు శ్రావణ్, రాజేశం పాల్గొన్నారు.

# ముగిసిన

# వార్డు మెంబర్ల శిక్షణ



**వాస్తవం : మాడుగులపల్లి:**

గత నాలుగు రోజులుగా మండల కేంద్రంలోని ఎమ్మార్సీ బిల్డింగ్ ఆవరణలో నిర్వహిస్తున్న వార్డ్ మెంబర్ల మొదటి బ్యాచ్ శిక్షణ కార్యక్రమం శుక్రవారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఎంపిడిఓ వంశీధర్ మాట్లాడుతూ జిల్లా పంచాయతీ అధికారి ఆదేశానుసారం వార్డ్ మెంబర్లకు శిక్షణ కార్యక్రమంలో వారి విధివిధానాలు బాధ్యతలు గ్రామపంచాయతీ అభివృద్ధికి ఏ విధంగా పాటుపడాలని వారికి శిక్షణ ఇవ్వడం జరిగిందని తెలిపారు అదేవిధంగా ప్రతి ఒక్క వార్డ్ మెంబర్‌కి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రచురించిన గ్రామపంచాయతీ పాలనకు సంబంధించిన పుస్తకాలను అందించడం జరిగిందని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ సంగీత, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, ఉప సర్పంచ్‌లు, వార్డ్ మెంబర్లు పాల్గొన్నారు.